**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

“ప్రజాప్రశ్న” దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 106, పేజీలు - 08

శుక్రవారం,అక్టోబర్ 16, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కరోనా కంటే డేంజర్‌గా ఎల్‌నినో

## - అందరం కలిసి ఎదుర్కొందామన్న సీఎం రేవంత్

- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదన్న సీఎం
- యాసంగిలో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తి
- గతేడాదితో పోలిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు సగానికి పడిపోయినట్లు వెల్లడి
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని కోరిన సీఎం రేవంత్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో నీరు, విద్యుత్ కొరత తీవ్రతరం అయ్యే అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర హెచ్చరికలు చేయడం ప్రస్తుతం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటి నుంచే ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ముందు జాగ్రత్త చర్యలు చెప్పారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని హితవు పలికారు. మరీ ముఖ్యంగా యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని కీలక విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం విద్యుత్ డిమాండ్ పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.

ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో సమీక్షించిన తర్వాత సచివాలయంలో మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నీటి లభ్యతపై కీలక వివరాలు వెల్లడించారు. గత ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రధాన

2లో..

# న్యాయ వ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

## - రాహుల్ గాంధీ ర్యాలీపై సీజేఐ సూర్యకాంత్ ఫైర్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు (సీఈసీ) వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేయడానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సుప్రీంకోర్టు కు చేపట్టిన పాదయాత్ర, నిరసన ప్రదర్శనలపై గురువారం అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసింది. రాహుల్ ర్యాలీపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ స్పందిస్తూ ‘న్యాయవ్యవస్థను ఎవ్వరూ బెదిరించలేరు’ అని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై నిర్ణయాలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరును ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ, ఇతర ‘ఇండియా’ కూటమి నాయకులు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లపై ఎన్నికల సంఘం, సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు కోర్టు నోటీసులు జారీ చేసింది. అయితే నోటీసులు ఇచ్చినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

2లో..

# పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటా

## - తెలంగాణలో పెట్టుబడులు పెట్టండన్న భటి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ‘తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి, మీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు, భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి’అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ?హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్-2026లో ఆయన మాట్లాడుతూ, సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ?పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం హైదరాబాద్‌ను పెట్టుబడులకు అత్యంత అనువైన గమ్యస్థానంగా నిలుపుతున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

### తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూలతలు

2లో..

# ఎస్ఐఆర్ వివాదం వేళ.. ఎస్ఎస్ఆర్ ప్రక్రియ

## - 17 రాష్ట్రాల్లో చేర్పులకు ప్రత్యేక సవరణ




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకియ పై దేశవ్యాప్తంగా రచ్చ జరుగుతున్న తరుణంలో కేంద్ర ఎన్నికల కమిషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. కొత్త ఓటర్లను చేర్చడం, ఎస్ఐఆర్ ద్వారా తొలగించిన వారిని కవర్ చేయడంపై దృష్టి సారిస్తూ 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక చేర్పుల సవరణ (ఎస్ఎస్ఆర్)కు ఉత్తర్వులు వెలువరించింది. ఈ సవరణ పరిధిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు

2లో..

# మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది

- మహిళల ఉత్పత్తులకు ‘స్వయం ఏపీ’ బ్రాండ్
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక
- ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ






అమరావతి (ప్రశ్న న్యూస్) గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని, మరో ఐదు లక్షల మందిని ఆ దిశగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ

2లో..



# ఉపాధి కల్పిస్తున్న గూనుగుపూలు

## - బతుకమ్మ వేళ కూలీలకు కాసుల వర్షం!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వచ్చిందంటే చాలు, ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గునుగు పువ్వుల సందడి నెలకొంటుంది. తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులు ప్రకృతి ఒడిలో లభించే రకరకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. అయితే, బతుకమ్మ తయారీలో అత్యంత కీలకమైన గునుగు పూల సేకరణ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విరివిగా జరుగుతుండటంతో, ఇది ఇతర జిల్లాల నుంచి వచ్చే పేద కూలీలకు ప్రధాన ఉపాధి మార్గంగా మారుతోంది. గత 15 ఏళ్లుగా ప్రతీ బతుకమ్మ సీజన్‌లోనూ పొరుగు

2లో..

# మహిళల ఆదాయార్జన దేశ ఆర్థిక సమృద్ధికి దోహదపడుతుంది

## - జాతీయ సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



అమరావతి (ప్రశ్న న్యూస్) మహిళలను ఇక లక్ పతీ దీదిలుగా కాదు కరోడ్ పతీ దీదిలుగా మార్చాలి అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో ఏర్పాటు చేసిన అమరావతి- జాతీయ సరస్ మేళా 2026ను కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్,రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లతో కలిసి రాష్ట్రపతి ప్రారంభించారు.అంతకుముందు సరస్ మేళా ప్రాంగణం వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలికిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడారు. దేవీ శరన్నవరాత్రుల వేళ, కనకదుర్గమ్మ సన్నిధిలో ఈ సరస్ మేళా ఏర్పాటు చేయటం అభినందనీయం అని కొనియాడారు.

### మహిళలు ఆర్థికంగా సాధికారిత సాధించాలి

ఢిల్లీ వెలుపల తొలిసారిగా స్వయం సహాయ సంఘాల జాతీయ సరస్ మేళను ప్రారంభించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేకంగా అభినందించారు. దేశవ్యాప్తంగా ఎస్ హెచ్ జీ

2లో..

# కూకట్‌పల్లి నాలాకు హైడ్రా బూస్ట్!

- ఆక్రమణల తొలగింపుతో నాలా విస్తరణకు కార్యాచరణ
- ఫతేనగర్-బాలానగర్ వరద ముంపునకు శాశ్వత పరిష్కారంపై దృష్టి
- పేదల నివాసాలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని రంగనాథ్ ఆదేశం

3లో..



# ప్రభుత్వానిది ‘ఒకే దేశం, ఒకే పార్టీ’ నినాదం

## - సీఈసీను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోంది

3లో..



# ఆసియా క్రీడల విజేతలతో ప్రధాని మోదీ భేటీ

- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం

2లో..

# కరోనా కంటే డేంజర్‌గా ఎల్‌నినో

రిజర్వాయర్లలో కలిపి 400 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉండగా ప్రస్తుతం నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ వినియోగించాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. హైదరాబాద్‌కు తాగునీరు అందించే జలాశయాల్లోనూ నీటి మట్టాలు తగ్గుతున్నాయని సీఎం గుర్తు చేశారు. వచ్చే కొన్ని నెలలు రాష్ట్రానికి అత్యంత కీలకమని తిరిగి వర్షాలు కురిసే వరకు ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని రైతులు ఒక పంట సీజన్‌ను వాయిదా వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యాసంగిలో వరి సాగు చేయకుండా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. సాగునీటి అవసరాలను తగ్గించకపోతే తాగునీటి సరఫరాపైనా ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని వివరించారు. రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని వారిని ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం భరోసా కల్పించారు. వ్యవసాయ పనులు తగ్గితే ఉపాధి కోల్పోయే రైతు కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించే అంశంపైనా దృష్టి సారించినట్లు చెప్పారు. చెరువులు, కుంటలను రాబోయే వర్షాకాలానికి సిద్ధం చేసే పనులను చేపట్టాలని సూచించారు.రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. సాధారణ స్థాయితో పోలిస్తే అదనంగా సుమారు 5 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగినట్లు తెలిపారు. అక్టోబర్‌లోనే వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదవడం అసాధారణమని పేర్కొన్నారు. రైతులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తమ ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. అవసరమైన విద్యుత్‌ను మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ధరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.అదనపు విద్యుత్ కేటాయింపులు చేయాలని రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ సబ్సిడీలతో పాటు కేంద్ర–రాష్ట్ర సంయుక్త పథకాల్లో కేంద్ర నిధుల వాటాను పెంచాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశంపై నిరంతరం సమీక్షలు నిర్వహించేందుకు కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రానికి అవసరమైన అదనపు నిధులు, విద్యుత్ సహాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామని తెలిపారు. ప్రకృతి పరిస్థితులను ఎదుర్కోవడంలో రాజకీయాలకు తావు ఇవ్వకుండా ప్రతిపక్షాలు కూడా తమ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సమస్య తీవ్రతపై ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రచారాన్ని నమ్మవద్దని అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. ఆయన ద్వారా అందే సమాచారాన్ని అధికారిక అప్‌డేట్‌గా పరిగణించాలని ప్రజలకు సూచించారు. మొత్తంగా నీటి నిల్వలు తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, విద్యుత్ డిమాండ్ అధికం కావడం వంటి పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అవుతోంది. రైతులు యాసంగిలో పంటల ఎంపికపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. కేంద్రం, రాష్ట్రం, రైతులు, ప్రజలు సమన్వయంతో వ్యవహరిస్తేనే రానున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగలమని పేర్కొన్నారు.

## న్యాయ వ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

"మేము నోటీసులు జారీ చేస్తున్నాం, కానీ తదుపరి విచారణ నాటికి ఆయన (రాహుల్ గాంధీ) ప్రవర్తన ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నాం" అని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు. నిరసన వ్యవహారాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది గౌరవ్ భాటియాలు కోర్టు దృష్టికి తీసుకురావడంతో ధర్మాసనం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది.'రాజకీయ ర్యాలీలతో ఈ కోర్టును చుట్టుముట్టడం ఆమోదయోగ్యం కాదు. సుప్రీంకోర్టులో జరగకూడనిది జరిగింది" అని గౌరవ్ భాటియా గుర్తుచేశారు. ఈ సమయంలో సీజేఐ స్పందిస్తూ 'న్యాయవ్యవస్థను ఎవ్వరూ బెదిరించలేరు' అని తేల్చి చెప్పారు. ఈ నిరసనలు, మార్చ్ అనేవి న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నమేనని భాటియా పేర్కొనగా ఆ ప్రయత్నాలను 'బలహీనమైనవి'గా సీజేఐ అభివర్ణించారు. 'ఇలాంటి బలహీనమైన ప్రయత్నాలను ఎవరూ పట్టించుకోరు. బయట వాళ్లు రకరకాల ప్రకటనలు చేస్తుంటారు మేమేమీ అద్దాల మేడల్లో కూర్చోలేదు, బయట ఏం జరుగుతుందో మాకు అన్నీ తెలుసు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే, సుప్రీంకోర్టుకు చేపట్టిన ప్రదర్శన విషయంలో దాఖలైన ప్రత్యేక పిటిషన్‌పై రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌తో పాటు మరికొందరికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇండియా కూటమి నిరసన సమయంలో సుప్రీంకోర్టు ప్రాంగణంలో నమోదైన సీసీటీవీ రికార్డింగ్‌లను భద్రపరచాలని కోర్టు ఆదేశించింది.సోమవారం, అక్టోబర్ 12న సెంట్రల్ ఢిల్లీలోని బారాఖంబా రోడ్ నుంచి రాహుల్ గాంధీ నాయకత్వంలో 'ఇండియా' కూటమి మార్చ్ ప్రారంభమై సుప్రీంకోర్టు వరకు సాగింది. ఈ నిరసన వల్ల కోర్టు ప్రాంగణంలో భారీగా జనం గుమిగూడారు. అంతకుముందు, ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్నికల సంఘం పనితీరుకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు రాహుల్ గాంధీ కోరిన అపాయింట్‌మెంట్‌ను సీజేఐ సూర్య కాంత్ తిరస్కరించారు. సదరు అంశాలు ఇప్పటికే సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ సీజేఐ ఆ అభ్యర్థనను తోసిపుచ్చారు. పాలనాపరమైన అంశాల్లో ప్రభుత్వం పనిచేసే తీరులో కోర్టు జోక్యం చేసుకోలేదని, అయితే సరైన ఉపశమనం కోసం న్యాయపరంగా కోర్టును ఆశ్రయించేందుకు నాయకులకు పూర్తి స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు.ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతా రాయ్, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి ప్రసాద్ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ)కి చెందిన సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, సీపీఐకి చెందిన డి. రాజా, జార్ఖండ్ ముక్తి మోర్చాకు చెందిన మహువా మాజీ, సీపీఎం నేత ఎంఏ బేబీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఇటి మహమ్మద్ బషీర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో 'ఇండియా' కూటమి తన పది ప్రధాన డిమాండ్లను కోర్టు ముందుంచింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించేలా ఆదేశించడం, ఎస్ఐఆర్ నిర్ణయాల రాజ్యాంగ చెల్లుబాటును పరిశీలించడం, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడం, పిటిషనర్ల ఫిర్యాదులను పరిష్కరించడం, స్వతంత్ర కమిటీతో ఆడిట్ జరిపించడం వంటివి అందులో ఉన్నాయి.

# ఆసియా క్రీడల విజేతలతో ప్రధాని మోదీ భేటీ

ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు.

వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

# మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది

సరస్ మేళా–2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ జాతీయ సరస్ మేళా నిర్వహించడం విజయవాడకు మరింత శోభ తెచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

### ద్రౌపది ముర్ము జీవితం ప్రతీ ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని కొనియాడారు. సంకల్ప బలం, ధైర్యం ఉంటే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని సీఎం తెలిపారు. ఇది కేవలం 14 రోజులపాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల మహిళలు తమ అనుభవాలను పంచుకోవడంతోపాటు విజయగాథలను తెలుసుకోవాలని, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

### రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో డ్వాక్రా సంఘాలు

ఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు, 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సంఘాల ద్వారా రూ.69 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు 3.5 కోట్ల మందికి చేరుతున్నాయని వివరించారు. గతంలో వెలుగు కార్యక్రమం ద్వారా మహిళలు సంపద సృష్టించే దిశగా అడుగులు వేశారని గుర్తుచేశారు. నిన్నటి వరకు పొదుపు సంఘాలుగా ఉన్న ఎస్ హెచ్ జీలు నేడు వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా స్వయం ఏపీ పేరుతో మార్కెటింగ్ చేస్తామని తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ మార్కెట్ల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు మహిళల ఉత్పత్తులు చేరేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించు కున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించడం, వారి ఆలోచనలకు విలువ ఇవ్వడం, కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలు, సహకారం అందించడం సమాజ బాధ్యత అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి

సంక్షేమ పథకాలతో మహిళలకు భరోసా కల్పిస్తూనే, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. తల్లికి వందనం పథకంతో పిల్లల చదువుకు అండగా నిలుస్తున్నామని, దీపం పథకంతో మహిళల ఖర్చులను తగ్గిస్తున్నామని చెప్పారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలు చేశారని వెల్లడించారు. మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు సహా పలు ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం నుంచి అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక చిన్న ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మహిళల భద్రత, ఆత్మగౌరవం, సాధికారతకు ప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు. ఇంట్లోని ప్రతి మహిళను ప్రోత్సహించాలని, వారి కలలు నిజం చేసుకునేందుకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలని చంద్రబాబు నాయుడు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్రగవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అనిత తదితరులు హాజరయ్యారు.

# ఉపాధి కల్పిస్తున్న గూనుగుపూలు

జిల్లాల నుంచి వందలాది కుటుంబాలు ఇక్కడికి తరలివచ్చి గునుగు పూలను సేకరిస్తూ జీవనోపాధి పొందుతున్నాయి.ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని వ్యవసాయ క్షేత్రాలు, అటవీ పరిసర ప్రాంతాలలో గునుగు పూలు విస్తారంగా లభిస్తాయి. పొలాల్లో ఇవి కలుపు మొక్కల్లా సహజంగా పెరగడంతో స్థానిక రైతులు కూడా ఇతర జిల్లాల నుంచి వచ్చే కూలీలను ఉచితంగానే తీసుకెళ్లమని ప్రోత్సహిస్తుంటారు. దీంతో పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి కూలీలు వాహనాల్లో ఆదిలాబాద్ గ్రామాలకు చేరుకుంటారు. కొల్హారీ వంటి గ్రామాల శివారుల్లో గునుగు పూలను సేకరించి, వాటిని కట్టలుగా కట్టి తమ సొంత జిల్లాలకు తరలిస్తుంటారు.ఈ పూల సేకరణే తమకు పండుగ సీజన్‌లో ఆసరాగా నిలుస్తోందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ జిల్లాల్లో ఒక పూల కట్టను రూ.10, 20 నుంచి రూ.50 వరకు విక్రయిస్తామని తెలిపారు. వాహన ప్రయాణ ఖర్చులు పోను ఈ తొమ్మిది రోజుల పండుగ సీజన్‌లో ప్రతీ కుటుంబానికి రూ.5,000 నుంచి రూ.6,000 వరకు నికర ఆదాయం లభిస్తుందని, ఇది తమ కుటుంబ అవసరాలకు ఎంతో తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు.వ్యాపార విక్రయాలు పూర్తి అయిన తర్వాత మిగిలిన పూలను తమ కుటుంబ సభ్యులంతా కలిసి బతుకమ్మ సంబరాల్లో ఆనందంగా ఉపయోగిస్తామని కూలీలు చెబుతున్నారు. తంగేడు, గునుగు, చామంతి, బంతి పూలతో బతుకమ్మను అలంకరించడం తెలంగాణ సంప్రదాయం కాగా, అందులో గునుగు పువ్వుకు ప్రత్యేక స్థానం ఉంది. పొరుగు జిల్లాల్లో ఈ పూలు తగినంత స్థాయిలో లభించకపోవడమే తాము దశాబ్దన్నరగా ఆదిలాబాద్‌కు రావడానికి ప్రధాన కారణమని వివరిస్తున్నారు.ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే గునుగు పువ్వులు కేవలం పండుగ శోభకే పరిమితం కాకుండా, వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే పేద కూలీల ఇళ్లల్లో వెలుగులు నింపుతున్నాయి. ఒకవైపు తెలంగాణ ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి వేడుకలు జరుపుకుంటుంటే, మరోవైపు అదే పూలు ఎందరో కూలీలకు బతుకు దెరువుగా మారి తెలంగాణ పండుగ విశిష్టతను, ప్రకృతి ఆధారిత మానవీయ సంబంధాలను మరోసారి చాటిచెబుతున్నాయి.

## మహిళల ఆదాయార్జన దేశ ఆర్థిక సమృద్ధికి దోహదపడుతుంది

మహిళలు పాల్గొంటున్న ఈ సరస్ మేళాను విజయవాడలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా సాధికారిత సాధించేలా ప్రధాని మోడీ ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. ఎస్ హెచ్ జీ మహిళలు సాంకేతికంగా, ఆర్థిక అంశాల్లో పెద్ద ఎత్తున భాగస్వామ్యం వహిస్తున్నారు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

### గ్రామీణ అజీవికా మిషన్‌తో మహిళలు మరింత రాణించాలి

'ఏపీ ఒడిశా రాష్ట్రానికి పక్కనే ఉన్నప్పటికీ తెలుగు భాషలో నేను మాట్లాడలేకపోతున్నాను. త్వరలోనే తెలుగు భాషను కూడా నేర్చుకుని మీతో మాట్లాడేందుకు వస్తానని హామీ ఇస్తున్నాను. మహిళలను ఇక లక్ పతీ దీదిలుగా కాదు కరోడ్ పతీ దీదిలుగా మార్చాలి'అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు.'దేశవ్యాప్తంగా చేపట్టిన చర్యల వల్ల ఎస్ హెచ్ జీల ఆర్థిక స్థితిగతులు మారాయి. ఎస్ హెచ్ జీ ల ద్వారా మహిళల్లో మరింత చైతన్యం పెరిగింది. వారికి మరిన్ని వనరులు అందేలా ప్రభుత్వాలు చూడాలి. గ్రామీణ అజీవికా మిషన్ ద్వారా మహిళలు నేతృత్వం వహించే మరిన్ని సంస్థలు ప్రారంభం కావాలి. మధ్యవర్తుల వ్యవస్థను తొలగించేలా అన్ని వ్యవస్థలూ మార్పులు తీసుకురావాలి' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

### గ్రామీణ మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకోవాలి

'గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా రైతులు స్వయం సాధికారితను సాధించేలా తోడ్పాటు అందించాలి. డిజిటల్ మాధ్యమాలు, విధానాలపై కూడా గ్రామీణ మహిళలకు మరింత అవగాహన కల్పించాలి'అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు.'దేశాన్ని ముందుకు నడిపేలా లక్ పతీ దీది కార్యక్రమం పెద్ద ఎత్తున తోడ్పడుతోంది.

గ్రామీణ మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకునేలా ఈ స్వయం సహాయ సంఘాలు సహకారం అందిస్తున్నాయి. దేశంలోని మారుమూల ప్రాంతాలు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల జీవనాన్ని దగ్గరి నుంచి పరిశీలించే సౌభాగ్యం నాకు కలిగింది'అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు.

### మన దేశంలో మహిళా శక్తిని పూజిస్తాం

'మన దేశంలో మహిళా శక్తిని పూజిస్తాం. మహిళలు– పురుషులు కలిసి పనిచేస్తేనే దేశం అభివృద్ధి సాధిస్తుంది. సరస్ లాంటి మేళాల ద్వారా బ్రాండింగ్, ప్యాకింగ్, నెట్వర్కింగ్ లాంటి విధానాలపై అవగాహన కలుగుతుంది'అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 'దేశ సంస్కృతిని మరింత ముందుకు తీసుకువెళ్లటంలో ఏపీ ముందు ఉంది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి భగవాన్ విష్ణుకు మరో రూపం, అమరావతిలో శిల్పకళా చాతుర్యం కూడా ఏపీ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతి రూపం. విజయవాడలో ఏర్పాటు చేసిన జాతీయ సరస్ మేళా 2026 తన లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. అన్ని రంగాల్లోనూ మహిళలు దూసుకు వెళ్తున్నారు. వికసిత్ భారత్ గా దేశాన్ని తీర్చిదిద్దటంలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు.

# ఎస్ఐఆర్ వివాదం వేళ.. ఎస్ఎస్ఆర్ ప్రక్రియ

రాష్ట్రాలు ఉన్నాయి. అర్హులైన వారిని గుర్తించేందుకు 2027 జనవరి 1ను గడువు తేదీగా నిర్ణయించారు. నవంబర్ 12న ముసాయిదా జాబితా, 2027 జనవరి 4న తుది జాబితాను ప్రచురించనున్నారు. కాగా యూపీ, పంజాబ్ అసెంబ్లీకి 2027 ఫిబ్రవరి నాటికి ఎన్నికలు జరగాల్సి ఉంది.ఎస్ఐఆర్‌పై నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ ప్రక్రియలో ఓటర్ల తొలగింపుపై విపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రక్రియలో ఫారమ్ 6తో పాటు దరఖాస్తుదారులు సమర్పించాల్సిన అదనపు డిక్లరేషన్ కూడా వివాదానికి ప్రధాన కారణమైంది. ఎస్ఐఆర్ పరిధిలోని ఇతర ఓటర్ల మాదిరిగానే, దరఖాస్తుదారులు దాదాపు 20 ఏళ్ల క్రితం జరిగిన చివరి ఎస్ఐఆర్ నమోదుతో తమ తల్లిదండ్రుల వివరాలను మ్యాప్ చేయాలని ఈ డిక్లరేషన్ కోరింది. ఇదే అంశంపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)లు నిరసనలు తెలుపుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తొలగించాలని డిమాండ్ చేస్తున్నాయి.అక్టోబర్ 15న ఈసీ జారీచేసిన ఉత్తర్వుల్లో "విస్మరించిన/ యువ/ తొలిసారి అర్హత సాధించిన ఓటర్లను నమోదు చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని" సెప్టెంబర్ 29న రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఇచ్చిన సూచనలను ఈసీ ప్రస్తావించింది. అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, మణిపూర్, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌తో పాటు అండమాన్ అండ్ నికోబార్ దీవులు కేంద్రపాలిత ప్రాంతం ఉంది.ఓటర్ల జాబితాలో పేరు చేర్చడానికి ఫారమ్ 6 లో దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఇందులో వివాదాస్పద అదనపు ఎస్ఐఆర్ డిక్లరేషన్ ప్రస్తావన లేదు. అక్టోబర్ 7న ఈసీ ఇచ్చిన వివరణలో సదరు డిక్లరేషన్ అనేది ఎస్ఐఆర్ జరుగుతున్న రాష్ట్రాలు/యూటీలలో మాత్రమే ఉపయోగించే అదనపు పత్రమని స్టం చేసింది. ఎస్ఐఆర్ లేని సమయంలో 'ఓటర్ల నమోదు నిబంధనలు, 1960' కింద నిర్దేశించిన సాధారణ ఫారమ్‌లే వర్తిస్తాయని పేర్కొంది. ఈ అదనపు డిక్లరేషన్ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉన్న పలు వివాదాస్పద అంశాలలో ఒకటిగా ఉంది.

### పేర్ల తొలగింపును అడ్డుకునే చర్యలు

అన్యాయంగా ఓట్ల తొలగింపు జరగకుండా ఈ ఉత్తర్వుల్లో పలు చర్యలను నిర్దేశించారు. 'మొత్తం ఓటర్లలో 2 శాతానికి పైగా తొలగింపులు ఉన్న చోట' ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు స్వయంగా వాటిని సరిచూసుకోవాలి. అలాగే ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ కేసుల్లో అభ్యంతరం తెలిపినప్పుడూ ఇది వర్తిస్తుంది. గంపగుత్తగా దరఖాస్తులను అడ్డుకోవడానికి ఒక వ్యక్తి దాఖలు చేసే ఫారమ్ 7 దరఖాస్తులపై పరిమితి విధిస్తూ అక్టోబర్ 9న జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈసీ ప్రస్తావించింది. శాశ్వతంగా నివాసం మారిన లేదా మరణించిన ఓటర్ల పేర్లను ఫారమ్ 7 దరఖాస్తు వచ్చిన తర్వాత మాత్రమే తొలగించాలని స్పష్టం చేసింది. ప్రతి ఓటు తొలగింపులో ఈఆర్ఓ సంబంధిత వ్యక్తి వాదన విన్న తర్వాత స్పష్టమైన ఉత్తర్వు ఇచ్చి, దానిని ఈసీనెట్ లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.గుర్తింపు పొందిన పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు రోజుకు గరిష్ఠంగా 10 ఫారమ్‌లను ఈసీకి చెందిన బీఎల్ఓలకు సమర్పించవచ్చు. అభ్యంతరాల సమయంలో ఒక ఏజెంట్ 30 కంటే ఎక్కువ ఫారమ్‌లను దాఖలు చేస్తే, ఈఆర్ఓ వాటిని వ్యక్తిగతంగా పరిశీలించాలి. క్లెయిమ్‌లు, అభ్యంతరాల జాబితాలను వారానికోసారి ప్రధాన ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో ప్రచురించడంతో పాటు రాజకీయ పార్టీలకు అందజేయాలి. "ఎస్ఐఆర్ కొనసాగుతున్న లేదా ఇటీవల పూర్తయిన రాష్ట్రాలు/ యూటీలు (ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఛండీగఢ్, దాద్రా అండ్ నాగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఢిల్లీ ఎన్‌సీటీ, ఒడిశా, సిక్కిం, త్రిపుర, తెలంగాణ) లలో ఎస్–ఎస్ఆర్ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తాం అలాగే, ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, లడఖ్ లలో వాతావరణ పరిస్థితులను బట్టి సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో ప్రకటిస్తాం" అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటా

తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనేక అనుకూలతలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరించారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు. హైదరాబాద్ వాతావరణం, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే సంప్రదాయం కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ప్రాచీన కాలం నుంచి హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపారులను, పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని, మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని మల్లు భట్టి విక్రమార్క వివరించారు.

### మూడు ప్రాంతాలుగా అభివృద్ధి ప్రణాళిక

హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్ అర్బన్ రీజియన్ (కోర్), పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ (రేర్) విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతంలో ఐటీ, మౌలిక సదుపాయాలు, సేవారంగానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. పెరి అర్బన్ ప్రాంతంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భవిష్యత్తులో నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని అనుసంధానిస్తూ రేడియల్ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు.

ఇప్పటికే 21 రేడియల్ రోడ్లకు సంబంధించి మంజూరు, రూపకల్పన ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ రహదారుల అనుసంధానంతో ఫార్మా, బయోటెక్నాలజీ, విద్య, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేసే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. రూరల్ అగ్రికల్చర్ రీజియన్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు అవసరమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వనరులకు విలువ జోడించే పరిశ్రమలు ఏర్పాటు కావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

### సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర

మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు.

ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించేవారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

### పరిశ్రమలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెట్టుబడులకు అవసరమైన అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు, వ్యాపారం, సినీ పరిశ్రమ, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

### అందరినీ కలుపుకొని అభివృద్ధి సాధించాలి

సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.

సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒక వర్గం మాత్రమే అభివృద్ధి చెందడం సంపూర్ణ ప్రగతి కాదని, తమతోపాటు మరో పదిమందిని ముందుకు తీసుకెళ్లినప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి విక్రమార్క, వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు.

# కూకట్‌పల్లి నాలాకు హైడ్రా బూస్ట్!

- ఆక్రమణల తొలగింపుతో నాలా విస్తరణకు కార్యాచరణ
- ఫతేనగర్-బాలానగర్ వరద ముంపునకు శాశ్వత పరిష్కారంపై దృష్టి
- పేదల నివాసాలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని రంగనాథ్ ఆదేశం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హుస్సేన్‌సాగర్‌లోకి వరద, మురుగునీటిని మోసుకెళ్లే కూకట్‌పల్లి నాలా విస్తరణపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఫతేనగర్–బాలానగర్ పారిశ్రామిక, నివాస ప్రాంతాలను తరచూ ముంచెత్తుతున్న వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టింది. నాలా ఆక్రమణలను తొలగించి, వరద నీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రవహించేలా విస్తరణ పనులు చేపట్టాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో పేదల నివాసాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ అంశంపై హైడ్రా ప్రధాన కార్యాలయంలో సీఎంసీ, ఎంఎంసీ, పారిశ్రామికవాడ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు, ఐలా అధికారులతో రంగనాథ్ సమావేశమయ్యారు. ఫతేనగర్‌--బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లో వరద ముప్పు, నాలా ఆక్రమణలు, విస్తరణకు ఉన్న అవకాశాలపై సమీక్షించారు. చెరువుల నుంచి వచ్చే వరద నీరు నాలాల ద్వారా సాఫీగా వెళ్లేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### 40 మీటర్ల నాలా.. 9 మీటర్లకు కుదింపు!

ఫతేనగర్ ప్రాంతంలో సుమారు 40 మీటర్ల వెడల్పు ఉండాల్సిన కూకట్‌పల్లి నాలా కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణల కారణంగా కేవలం 9 మీటర్లకు కుంచించుకుపోయినట్లు అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. పారిశ్రామికవాడ లేఅవుట్‌ను నాలా పొడవునా పరిశీలిస్తే ఆక్రమణల తీవ్రత స్పష్టమవుతుందని రంగనాథ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ ప్యాట్నీ నాలా విస్తరణ తరహాలో ఫతేనగర్‌లోనూ పనులు చేపట్టాలని సూచించారు.

పరికిచెరువు, ఐడీఎల్ చెరువుల నుంచి వచ్చే వరద నీరు కూకట్‌పల్లి నాలా ద్వారా ప్రవహిస్తుండగా, ఫాక్స్‌సాగర్ నుంచి జీడిమెట్ల మీదుగా వచ్చే వరద కాలువ గౌతంనగర్ పరిసరాల్లో ఈ నాలాలో కలుస్తుంది. అక్కడి నుంచి హుస్సేన్‌సాగర్‌లో కలిసే వరకు నాలా విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఫతేనగర్–బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లో నాలా సుమారు 4.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇందులో 2.2 కిలోమీటర్లు సీఎంసీ పరిధిలో, మరో 2 కిలోమీటర్లు ఎంఎంసీ పరిధిలో ఉన్నట్లు అధికారులు వివరించారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా నాలా హద్దులను గుర్తించి, ఆక్రమణల తొలగింపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని రంగనాథ్ ఆదేశించారు.

### పారిశ్రామికవాడకు 47 ఎకరాల కేటాయింపు

పారిశ్రామికవాడ కోఆపరేటివ్ సొసైటీకి 1963లో 30 ఎకరాలు, 1964లో మరో 17 ఎకరాలు కేటాయించినట్లు సమావేశంలో పారిశ్రామిక ప్రతినిధులు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో నాలా హద్దులు, పారిశ్రామిక ప్రాంతంలోని నిర్మాణాలు, ప్రస్తుత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు.

### అరగంట వర్షానికే పారిశ్రామిక యూనిట్లకు కష్టాలు

కేవలం 30 నిమిషాల పాటు వర్షం కురిసినా పారిశ్రామిక యూనిట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పారిశ్రామికవేత్తలు సమావేశంలో తెలిపారు. నాలా ఆక్రమణల తొలగింపు, విస్తరణ పనులకు పూర్తి సహకారం అందిస్తామని పారిశ్రామికవాడ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. తరచూ వరద ముంపునకు గురవుతున్న ప్రాంతాల్లో ముందుగా నాలా విస్తరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని రంగనాథ్ సూచించారు. అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, కూకట్‌పల్లి నాలా పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వానిది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదం

- సీఈసీను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోంది

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం ఆరోపించారు. ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ

ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు.

ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు.

### 'ఒకే దేశం, ఒకే పార్టీ' అజెండా

ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు.

### సీజేపీ నేతల అరెస్ట్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

# ఆలయాలే టార్గెట్.. హుండీలే గురి

- చిలకలూరిపేటలో దొంగల బరితెగింపు
- ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ..
- ఒక హుండీ పగులగొట్టి నగదు అపహరణ, మరోటి ఎత్తుకెళ్లిన వైనం!
- వరుస ఘటనలతో భక్తుల్లో ఆందోళన..
- భద్రతపై పోలీసుల దృష్టి ఎప్పుడు?



**చిలకలూరిపేట(ప్రశ్న న్యూస్)** దేవుడి సన్నిధిలోనూ దొంగల చేతివాటం ఆగడం లేదు! భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించే కానుకలే లక్ష్యంగా ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి. చిలకలూరిపేట పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడటం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. ఆలయ తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు రెండు హుండీలను లక్ష్యంగా చేసుకున్నారు. ఒక హుండీని ఆలయంలోనే పగలగొట్టి అందులోని నగదును అపహరించగా.. మరో హుండీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటనతో ఆలయాల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### రెండు హుండీలే లక్ష్యంగా..

ఎన్టీఆర్ కాలనీలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు ముందుగా తాళాలను పగలగొట్టినట్లు సమాచారం. అనంతరం ఆలయంలోని హుండీల వద్దకు చేరుకుని చోరీకి పాల్పడ్డారు. ఒక హుండీని పగలగొట్టి నగదును తీసుకున్నారు. మరో హుండీని అక్కడి నుంచి



ఎత్తుకెళ్లారు. భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను అపహరించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? రాత్రివేళల్లో నిఘా ఉంటోందా? సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.?

### వరుస చోరీలతో కలవరం!

చిలకలూరిపేట పరిసర ప్రాంతాల్లో ఇటీవల గణపవరం నుంచి లింగంపల్లి వెళ్లే మార్గంలోనూ ఇదే తరహా చోరీ జరిగినట్లు సమాచారం. తాజాగా ఎన్టీఆర్ కాలనీలోని ఆలయంలో ఘటన చోటుచేసుకోవడంతో ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఈ ఘటనల వెనుక ఒకే ముఠా ఉందా? వేర్వేరు వ్యక్తులు పాల్పడుతున్నారా? అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.
ఆలయాల్లో హుండీలకు భద్రత కల్పించడంతోపాటు, రాత్రివేళల్లో నిఘా పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉన్న ఆలయాల వద్ద భద్రతను మరింత పటిష్ఠం చేయాలని కోరుతున్నారు.

### పోలీసుల నిఘా పెరిగేదెప్పుడు?

ఆలయాల్లో చోరీలు జరగడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా, ప్రజల్లో భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. వరుస ఘటనల నేపథ్యంలో పోలీసులు స్పందించి చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలించడంతోపాటు, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి నిందితులను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

# బాలా త్రిపురసుందరిగా బాలలీలల తల్లి

- ఇంద్రకీలాద్రిపై బాలార్కుని కాంతులు.. బంగారు వర్ణంలో జగన్మాత దివ్యదర్శనం
- చిరునవ్వుల బాలరూపం.. చల్లని చూపుల అనుగ్రహం
- జ్ఞానానికి ఆదిశక్తి.. సౌందర్యానికి దివ్యరూపం.. భక్తుల పాలిట కల్పవల్లి

**విజయవాడ (ప్రశ్న న్యూస్)** అమ్మంటే ఆప్యాయత.. అమ్మంటే అనురాగం.. అమ్మంటే అనంతమైన కరుణ! సృష్టికి మూలమైన ఆదిపరాశక్తి ఒక్కో అలంకారంలో ఒక్కో తత్వాన్ని ఆవిష్కరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిస్తుంది. ఎప్పుడో ఉగ్రరూపిణిగా దుష్టశక్తులను సంహరిస్తుంది.. మరెప్పుడో మహాలక్ష్మిగా ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది.. ఇంకెప్పుడో సరస్వతిగా జ్ఞానజ్యోతులను వెలిగిస్తుంది. అదే జగన్మాత బాలారూపంలో దర్శనమిస్తే.. ఆ రూపంలోని లాలిత్యం, నిర్మలత్వం, చిద్విలాసం భక్తుల హృదయాలను భక్తిపారవశ్యంలో ముంచెత్తుతాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాల వేళ బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు అలాంటి అపురూపమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది. బాల్యం అంటే నిర్మలత్వం.. బాల్యం అంటే కల్మషం లేని మనసు.. బాల్యం అంటే అనంతమైన అవకాశాలకు ప్రతీక. అటువంటి బాల్య స్వరూపంలో జగన్మాతను దర్శించుకోవడం వెనుక లోతైన ఆధ్యాత్మిక అంతరార్థం దాగి ఉంది. సకల జగత్తులనూ నడిపించే పరాశక్తి బాలిక రూపంలోనూ అంతులేని శక్తికి ప్రతిరూపమని ఈ అలంకారం చాటిచెబుతుంది.

### బాలారూపంలో బ్రహ్మాండ నాయకురాలు!

శ్రీవిద్యా సంప్రదాయంలో బాలా త్రిపురసుందరీదేవికి విశిష్టమైన స్థానం ఉంది. త్రిపురసుందరీదేవి పరాశక్తి స్వరూపిణి కాగా, బాలా త్రిపురసుందరి ఆ జగన్మాత బాలరూపంగా ఆరాధించబడుతుంది. బాలా అంటే చిన్నారి.. కానీ ఆ చిన్నారి రూపంలోనే అనంతమైన జ్ఞానం, అపారమైన శక్తి, సకల సృష్టికి మూలమైన చైతన్యం అంతర్లీనంగా ఉన్నాయని ఆధ్యాత్మిక సంప్రదాయం వివరిస్తుంది. బాలా త్రిపురసుందరి ఆరాధనలో అమాయకత్వం, పవిత్రత, జ్ఞానప్రాప్తి, ఆత్మవికాసం ప్రధాన భావాలుగా కనిపిస్తాయి. బాలారూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం అంటే మనసులోని అహంకారాన్ని పక్కనపెట్టి, నిర్మలమైన హృదయంతో దైవాన్ని చేరుకోవడమేనని భక్తులు విశ్వసిస్తారు. లోకంలోని సమస్త విద్యలకు మూలమైన ఆదిశక్తి బాలారూపంలో దర్శనమివ్వడం జ్ఞానానికి, వివేకానికి, ఆధ్యాత్మిక వికాసానికి ప్రతీకగా భావిస్తారు. అందుకే విద్యార్థులు విద్యాబుద్ధులు ప్రసాదించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు సంతోషంగా ఉండాలని, కుటుంబాలు సుఖశాంతులతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థిస్తాయి.

### బాల్యంలోనే అనంతమైన శక్తి!

బాలా త్రిపురసుందరీదేవి రూపం మనకు ఓ గొప్ప సందేశాన్ని అందిస్తుంది. శక్తికి వయసుతో సంబంధం లేదని, సృష్టికి మూలమైన చైతన్యం ఏ రూపంలోనైనా వ్యక్తమవుతుందని ఈ ఆరాధన తెలియజేస్తుంది. చిన్నారి చిరునవ్వులో కనిపించే స్వచ్ఛత, బాల్యంలోని నిష్కల్మషత్వం, హృదయంలోని నిర్మలత్వం దైవత్వానికి ప్రతిరూపాలని ఆధ్యాత్మిక భావన. అమ్మవారిని బాలారూపంలో ఆరాధించడం ద్వారా భక్తులు తమ మనసుల్లోని కల్మషాలను తొలగించుకుని, ప్రేమ, దయ, కరుణ, సహనం వంటి సద్గుణాలను పెంపొందించుకోవాలని సంకల్పిస్తారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా చిన్నారి మనసులో ఉండే ఆశావాదంతో ముందుకు సాగాలని ఈ అలంకారం సూచిస్తుంది. శ్రీవిద్యా ఉపాసనలో బాలా త్రిపురసుందరీదేవిని జ్ఞానానికి, మంత్రవిద్యకు, అంతరంగ పవిత్రతకు సంబంధించిన దేవతగా కొలుస్తారు. ఆమె అనుగ్రహంతో అజ్ఞానాంధకారం తొలగి జ్ఞానజ్యోతి వెలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



### ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ!

కృష్ణానది తీరాన వెలసిన ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి వేళ భక్తి పరిమళాలతో పరవశిస్తోంది. కొండపై కొలువైన జగన్మాతను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారి ఒక్కో అలంకారం ఒక్కో ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుండగా, బాలా త్రిపురసుందరీదేవి రూపం భక్తుల మనసుల్లో ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తుంది. బంగారు వర్ణపు వస్త్రాలతో, పుష్పాలంకరణతో, సంప్రదాయ పూజావిధానాలతో అమ్మవారిని అలంకరించినప్పుడు ఆ దివ్యరూపం భక్తులకు కనువిందు చేస్తుంది. గంటల నాదం.. మంత్రోచ్చారణలు.. మంగళవాయిద్యాలు.. అమ్మవారి నామస్మరణ.. ఇవన్నీ కలసి ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పరిపుష్టం చేస్తాయి. అమ్మవారిని దర్శించుకునే భక్తులు తమ కుటుంబాల క్షేమం, పిల్లల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, సుఖసంతోషాల కోసం ప్రార్థిస్తారు. మరికొందరు జీవితంలోని సమస్యల నుంచి విముక్తి కలగాలని, మనశ్శాంతి లభించాలని వేడుకుంటారు. ఎవరి కోరికలు వారివైనా.. అమ్మవారి సన్నిధిలో మనసు ప్రశాంతంగా మారుతుందన్న విశ్వాసం అందరిలోనూ కనిపిస్తుంది.

### బాలా త్రిపురసుందరి ఆరాధనలో అంతరార్థం!

బాలారూపంలో జగన్మాతను కొలవడం కేవలం అలంకార దర్శనానికే పరిమితం కాదు. ప్రతి మనిషిలోనూ దాగి ఉన్న మంచితనాన్ని మేల్కొలపడం, మనసును నిర్మలంగా ఉంచుకోవడం, ఇతరుల పట్ల ప్రేమతో వ్యవహరించడం వంటి జీవిత విలువలను ఈ ఆరాధన గుర్తుచేస్తుంది. బాల్యంలో ఉండే స్వచ్ఛమైన చిరునవ్వు ఎలాంటి భేదభావాలనూ ఎరుగదు. అలాగే దైవం ముందు ధనికుడు, పేదవాడు, ఉన్నతుడు, సామాన్యుడు అనే తేడాలు ఉండవని భక్తి సంప్రదాయం చాటిచెబుతుంది. భక్తితో అమ్మవారిని స్మరించే ప్రతి ఒక్కరికీ ఆమె కరుణ లభిస్తుందన్న విశ్వాసమే శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రాణం. ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత బాలా త్రిపురసుందరీదేవి రూపాన్ని దర్శించుకుని, ఆమె దివ్యకటాక్షంతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రతి హృదయంలో జ్ఞానజ్యోతి వెలగాలని, సమాజమంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థిస్తున్నారు.

# అమ్మవారికి రూ.75 లక్షల స్వర్ణ కిరీటం

**నవరత్నాల మెరుపులతో**
**జగన్మాతకు బంగారు కానుక**
**494 గ్రాముల బంగారంతో రూపుదిద్దుకున్న కిరీటం సమర్పణ**
**శ్రీకాకుళం భక్తుడి అపురూప కానుక.. దాత కుటుంబానికి**
**అంతరాలయ దర్శనం**



ఇంద్రకీలాద్రి(ప్రశ్న న్యూస్) శరన్నవరాత్రి వేళ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మకు అపురూపమైన స్వర్ణ కానుక సమర్పించారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన కె. దుర్గా శ్రీనివాస్ అమ్మవారికి సుమారు రూ.75 లక్షల విలువైన నవరత్న ఖచిత స్వర్ణ కిరీటాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో బహూకరించారు. 494 గ్రాముల బరువున్న ఈ బంగారు కిరీటాన్ని ఎరుపు, నీలం, తెలుపు, పచ్చ రంగుల రాళ్లతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. పవిత్రమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో అమ్మవారికి ఈ కానుక సమర్పించడం విశేషంగా నిలిచింది.

### నవరత్నాల కాంతులతో స్వర్ణ శోభ!

శ్రీకాకుళం పట్టణానికి చెందిన కూర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ అమ్మవారిపై భక్తితో ఈ స్వర్ణ కిరీటాన్ని సమర్పించారు. నవరత్నాలతో అలంకరించిన ఈ కిరీటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 494 గ్రాముల బంగారంతో రూపొందించిన ఈ కానుక విలువ సుమారు రూ.75 లక్షలుగా దాతలు వెల్లడించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్న తరుణంలో ఈ కానుక సమర్పణకు ప్రాధాన్యం ఏర్పడింది. అమ్మవారిపై తమకున్న భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా స్వర్ణ కిరీటాన్ని సమర్పించినట్లు దాత కుటుంబ సభ్యులు తెలిపారు.

### అధికారులకు స్వర్ణ కిరీటం అందజేత

దాత కె. దుర్గా శ్రీనివాస్ కుటుంబ సభ్యులు స్వర్ణ కిరీటాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, దసరా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావు సంయుక్తంగా ఈ కానుకను స్వీకరించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో



శ్రీ కనకదుర్గమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందించి సత్కరించారు.

### అమ్మవారి దయతోనే ఈ భాగ్యం

ఈ సందర్భంగా దాత కె. దుర్గా శ్రీనివాస్ మాట్లాడుతూ.. లోకపావని అయిన కనకదుర్గమ్మ దయతోనే అమ్మవారికి ఈ స్వర్ణ కిరీటాన్ని సమర్పించుకునే భాగ్యం కలిగిందన్నారు. పవిత్రమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ జగన్మాతకు స్వర్ణ కిరీటాన్ని బహూకరించే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఆలయ కార్యనిర్వహణాధికారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జగన్మాతపై భక్తితో సమర్పించిన రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక కానుకగా నిలిచింది.

# అలుపెరగని పోరాటాలే హక్కుల సాధనకు బాటలు: వేణుకుమార్

**(కామ్రేడ్ జి. రామచందర్ 12 వ వర్ధంతి సభలో ఘన నివాళి)**




వైద్య ఉద్యోగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలతో ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ముందడుగు వేసిన స్వర్గీయ కామ్రేడ్ జి. రాంచందర్ ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యనిర్వహక అధ్యక్షుడు కామ్రేడ్. వి. వేణుకుమార్ అన్నారు. కామ్రేడ్ జి. రామచందర్ 12 వ వర్ధంతిని పురస్కరించుకుని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వి. వేణుకుమార్ మాట్లాడుతు ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యంగా ముందుండి పోరాటాలు చేయడంలో ఆయన చూపిన నాయకత్వం, నిబద్ధత కృషి చిరస్మరణీయమని అన్నారు. అన్యాయాన్ని ఎదిరించి, ఉద్యోగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల పక్షాన పోరాడి సాధించుకున్న విజయాలు నేటి తరానికి పూల బాటలుగా నిలుస్తున్నాయని తెలిపారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకున్నను ఆయన చూపిన మార్గంలో పయనిస్తు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తు ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలు చేస్తు సమస్యల సాధనలో ముందుడుగు వేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాచారం ఈఎస్ఐ బ్రాంచ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గోని కామ్రేడ్ జి. రామచందర్ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.

# వేములవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**8 వేల రూపాయల లంచం తీసుకుంటూ తహశీల్దార్,**

**భూభారతి ఆపరేటర్ పట్టివేత**




సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన దాడుల్లో వేములవాడ రూరల్ తహశీల్దార్ అబూబాకర్, భూభారతి ఆపరేటర్ సంకసాల అనిల్ పట్టుబడ్డారు. ఓ బాధితుడి భూ సంబంధిత పనిని పూర్తి చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్ని చర్యలు చేపట్టారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు ఆపరేటర్ అనిల్ బాధితుడి నుంచి 8 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.

## దరఖాస్తును పెండింగ్‌లో పెట్టి లంచం డిమాండ్

ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. బాధితుడు తన భూ సంబంధిత పని నిమిత్తం గత సెప్టెంబర్‌లో స్లాట్ బుక్ చేసుకుని వేములవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. అయితే వివిధ కారణాలు చూపుతూ ఆయన దరఖాస్తును తిరస్కరించి, పనిని పెండింగ్‌లో పెట్టినట్లు ఫిర్యాదులో తెలియజేశారు.ఆ పనిని పూర్తి చేయాలంటే రూ.10 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే తన వద్ద అంత మొత్తం లేదని, రూ.8 వేలు మాత్రమే సమకూర్చగలనని బాధితుడు చెప్పినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ

లంచం డిమాండ్ వ్యవహారంపై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన అధికారులు పక్కా వ్యూహంతో వలపన్నారు. ఇందులో భాగంగా తహసీల్దార్ అబూబాకర్ ఆదేశాల మేరకు భూభారతి ఆపరేటర్ సంకసాల అనిల్ బాధితుడి నుంచి రూ.8 వేల నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై మరోసారి చర్చ

ప్రజలు తమ భూ సమస్యలు, ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాలను ఆశ్రయించినప్పుడు నిబంధనల ప్రకారం సేవలు అందించాల్సిన అధికారులు, సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనతో వేములవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

## పైసలిస్తేనే ఫైలు కదిలే పరిస్థితి

జిల్లాల్లో తహశీల్దార్ కార్యాలయాల్లో 500రూ. ఇస్తేనే ఫైలు కదిలిస్తే పరిస్థితి ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఫైలు కదిలే పరిస్థితి లేదని, సైట్ రావడం లేదు అని, ఇతరత్రా కారణాలు చెబుతూ, రోజుల తరబడి తిరిగేలా చేస్తున్నారని, రోజువారి కూలీ చేసుకునే దినసరి కూలీలు ఒక రోజు కైకలి ఇస్తే అయిపోతుంది లేదంటే, రెండు,మూడు రోజులు తిప్పుతారని, తప్పనిసరి పరిస్థితుల్లో పైసలు అప్పగిస్తున్నారు. లంచాలకు అలవాటు పడ్డ లంచగొండులను కటకటాలకు పంపిస్తే అవినీతిపరుల ఆట కట్టించినట్టు అవుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# నేడు 2బి బార్ల లాటరీ ద్వారా ఎంపిక

**దరఖాస్తుదారులు హాజరుకావాలని**

**ఎక్సైజ్ శాఖ అధికారుల విజ్ఞప్తి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అలియాబాద్-1, మూడుచింతలపల్లి-2, ఎల్లంపేట-2 బార్లకు ఈనెల 16న ఉదయం 9 గంటలకు లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, షామీర్‌పేట మండలం, అంతాయిపల్లి గ్రామంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ( ఐ డి ఓ సి )లో 2బి బార్లను లాటరీ విధానం ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ బార్లకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులందరూ నిర్ణీత తేదీ, సమయానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ తెలిపారు.

# ఈఎస్ఐ ఆస్పత్రిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు




నాచారం (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలతో నగర వీధులన్నీ సందడిగా మారాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలతో ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహభరితంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గోని సందడి చేస్తున్నారు. ఈ సందర్భంగా నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నాడు నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆస్పత్రి మహిళా సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆడిపాడి సందడి చేసారు. పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే సంస్కృతికి



ప్రతిభింబమైన బతుకమ్మ సంబరాలు, మహాలయ అమావాస్య నాటి నుండి తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా జరుపుకుంటారు. నిత్యం వైద్య చికిత్సల కోసం వచ్చే రోగులు వారి సహాయకులతో కిటకిటలాడే ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణ బతుకమ్మ వేడుకలతో ఆటలు,పాటలతో సందడిగా మారింది.

## క్విజ్ పోటీలు

బతుకమ్మ సంబరాల్లో భాగంగా క్విజ్ పోటీలు, బతుకమ్మ పాటలు, ఉత్తమ బతుకమ్మ అలంకరణ పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా ఉద్యోగినులు ఎంతో ఉత్సాహభరితంగా ఈ పోటీల్లో పాల్గోని వేడుకలను ఆనందభరితంగా మార్చారు.

## బహుమతుల ప్రధానం

బతుకమ్మవేడుకల్లో భాగంగా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గోన్న ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. సత్యనారాయణ విజేతలకు బహుమతులను అందజేశారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి రాబోయే తరాలకు అందేలా మహిళా ఉద్యోగినులు చూపిన కృషి అభినందనీయమని డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు.

## పరస్పర సాన్నిహిత్యం

బతుకమ్మ వేడుకల వల్ల సంస్కృతిక ఐక్యతా, పరస్పర సహకారం, సమానత్వం, మహిళా సాధికారతకు దోహదం చేస్తాయని నిర్వాహకులు పేర్కోన్నారు. ఈ సంబరాల్లో పాల్గోని నిర్వాహకులకు సహకరించి విజయవంతం చేసిన మహిళా ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్యక్రమ నిర్వహణలో తమ పూర్తి సహకారాన్ని అందించిన ఉద్యోగులకు, యూనియన్ ప్రతినిధులకు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున వి. వేణుకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు అంజని, శ్రీలత, అరుణ, భాగ్య, ప్రేమలత, సుజాత, వేణు కుమార్, రాఘవేందర్, సంతోష్, రమేష్, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గోన్నారు.

# ఆ ఇద్దరూ పైసల కోసమే ప్రాణం తీశారు

**- 12 గంటల్లోనే హత్య కేసు ఛేదించిన పోలీసులు - రైల్వే స్టేషన్‌లో పట్టుకుని రిమాండ్‌కు తరలింపు**

ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) రాచర్ల గొల్లపల్లి గ్రామంలో సంచలనం సృష్టించిన టైల్స్ వర్క్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య కేసును పోలీసులు కేవలం 12 గంటల్లోనే ఛేదించారు. డబ్బుల కోసం తమతో కలిసి పనిచేస్తున్న టైల్స్ పనుల కూలీలు మృతునికి వరుసకు బావమరిది అయిన రాజస్థాన్ కు చెందిన జోగిందర్, ఉత్తరఖండ్ కు చెందిన శివం ఆగ్రా ఉత్తర ప్రదేశ్ కు చెందిన టైల్స్ కాంట్రాక్టర్ పవన్ ను (28 ) ఇంట్లో కూరగాయలు కోసే కత్తితో 14వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటల ప్రాంతంలో మెడపై, గొంతుపై కోసి, చాతిపై పొడిచి హత్య చేసి తలుపులు పెట్టి పవన్ కు చెందిన ద్విచక్ర వాహనంపై పరారైనట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జోగిందర్, శివమ్‌లను వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ ప్రత్యేక పోలీసు బృందం రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసింది. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మీడియా సమావేశం.

ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ కత్తురోజు నాగేంద్రచారి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గొల్లపల్లి గ్రామంలో జరిగిన ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులను గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. సీఐ ఓ. వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులు పరారైన మార్గాలు, అందుబాటులో ఉన్న ఆధారాలపై దృష్టి సారించారు.

## టైల్స్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పవన్ సింగ్ టైల్స్ వర్క్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న భవనాలకు టైల్స్ బిగించే పనులు చేపడుతూ, తన రాష్ట్రానికి చెందిన ఇతర కూలీలను కూడా పనుల నిమిత్తం తీసుకువచ్చేవాడని తెలిసింది. ఈ క్రమంలో గొల్లపల్లి గ్రామంలో పనులు నిర్వహిస్తున్న సమయంలో పవన్ సింగ్ హత్యకు గురయ్యాడు. గొల్లపల్లిలోని శాతవాహన కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన భవనానికి సంబంధించిన గదిలో ఈ ఘటన వెలుగుచూసింది. సమాచారం



అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి, హత్య జరిగిన గది, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో కీలక ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు.

## పైసల కోసమే హత్య చేసినట్లు వెల్లడి

పోలీసుల దర్యాప్తు ప్రకారం. పవన్ సింగ్‌తో కలిసి పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు జోగిందర్, శివమ్ డబ్బుల కోసం ఈ హత్యకు పాల్పడినట్లు వెల్లడైంది. హత్య అనంతరం అక్కడి నుంచి పరారైన ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసును సవాలుగా తీసుకున్న సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం సాంకేతిక, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ క్రమంలో పరారీలో ఉన్న జోగిందర్, శివమ్‌లను రైల్వే స్టేషన్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి, చట్టపరమైన ప్రక్రియ పూర్తిచేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి మీడియాకు వివరించారు.

## పోలీసు బృందానికి డీఎస్పీ అభినందనలు.

హత్య జరిగిన కొద్ది గంటల్లోనే దర్యాప్తును వేగవంతం చేసి, 12 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ నాగేంద్రచారి అభినందించారు. ఈ కేసులో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందించేందుకు సిఫారసు చేస్తానని తెలిపారు. గొల్లపల్లిలో టైల్స్ వర్క్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య స్థానికంగా కలకలం రేపగా, పోలీసులు వేగంగా స్పందించి నిందితులను పట్టుకోవడంతో కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. మీడియా సమావేశంలో ఎల్లారెడ్డి పేట సి ఐ ఓ.వెంకటేష్, ఎల్లారెడ్డి పేట ఎస్ ఐ ఎన్.రమేష్, వీర్నపల్లి ఎస్ ఐ లక్ష్మణ్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా రైతులకు ఘనంగా సన్మానం




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మహిళా రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని షామీర్‌పేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో మహిళా రైతులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో మహిళా రైతులు అందిస్తున్న సేవలను, వ్యవసాయ ఉత్పత్తి పెంపులో మరియు కుటుంబ ఆర్థికాభివృద్ధిలో వారు పోషిస్తున్న కీలక పాత్రను కొనియాడారు. పంటల సాగు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, పంటల సంరక్షణ తదితర వ్యవసాయ కార్యకలాపాల్లో మహిళా రైతుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మహిళా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, ప్రభుత్వ వ్యవసాయ శాఖ అందించే పథకాలు మరియు సాంకేతిక సూచనలను వినియోగించుకొని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. మహిళా రైతుల కృషిని గుర్తించి, వారిని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగంలో వారి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు సరసం లక్ష్మీ , వంగేటి సమత, బాలమణి మరియు ఇతర మహిళా రైతులను సత్కరించి వ్యవసాయ రంగంలో వారి సేవలకు అభినందనలు తెలియజేశారు.

# బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా సుంకు నవీన్ ముదిరాజ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మేడ్చల్ రూరల్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని బీజేవైఎం (భారతీయ జనతా యువమోర్చా) మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధి సుంకు నవీన్ కుమార్ ముదిరాజ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని సుంకు నవీన్ ముదిరాజ్ వెల్లడించారు.

# పార్కింగ్ దందా.. ప్రాణాలతో చెలగాటం

# పైకప్పు పెచ్చులూడుతున్నా పట్టదా.?

**అలంకార్ థియేటర్ సెల్లార్‌లో భయానక పరిస్థితులు**

**నీళ్లలో వాహనాలు.. నిలువుదోపిడీకి తెర!**

**బైక్‌కు రూ.30.. కారుకు రూ.50.. వసతులు శూన్యం**

**ప్రమాదం జరిగితే బాధ్యులెవరు.? అధికారుల పర్యవేక్షణ ఏదీ.?**






విజయవాడ (ప్రశ్న న్యూస్) సినిమా చూడటానికి థియేటర్‌కు వెళితే వినోదం మాట అటుంచితే.. వాహనం పార్కింగ్ చేయడమే ప్రాణసంకటంగా మారితే? వాహనాన్ని భద్రంగా నిలిపేందుకు డబ్బులు చెల్లించినా.. పైనుంచి కాంక్రీట్ పెచ్చులు ఊడిపడే ప్రమాదం పొంచి ఉంటే? సెల్లార్ మొత్తం నీటితో నిండిపోయి, బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తే? ఇదీ విజయవాడ గాంధీనగర్‌లోని అలంకార్ థియేటర్ పార్కింగ్ ప్రాంతంపై వినిపిస్తున్న ఆరోపణల సారాంశం. ఒకవైపు శిథిలావస్థకు చేరినట్లు కనిపిస్తున్న భవనం.. మరోవైపు వర్షపు నీరు, మురుగునీటితో నిండిన సెల్లార్.. ఇంకోవైపు పార్కింగ్ రుసుముల వసూళ్లు.. వెరసి సినిమా ప్రేక్షకులకు ఇబ్బందులు తప్పడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీస భద్రత, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించకుండానే రుసుములు వసూలు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితులపై సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది.

## పెచ్చులూడుతున్న పైకప్పు.. పొంచి ఉన్న ప్రమాదం

థియేటర్ సెల్లార్ ప్రాంతంలోని పైకప్పు, గోడలపై సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయని, కొన్ని చోట్ల కాంక్రీట్ దెబ్బతిని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా వాహనాలను పార్కింగ్ చేసే ప్రదేశం సురక్షితంగా ఉండాలి. వాహనాలను నిలిపే సమయంలో వాటికి ఎలాంటి నష్టం కలగకుండా, అక్కడికి వచ్చే ప్రజలకు ప్రమాదం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ అలంకార్ థియేటర్ సెల్లార్‌లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైకప్పు నుంచి కాంక్రీట్ పెచ్చులు ఊడిపడే పరిస్థితి ఉంటే అక్కడ వాహనాలను నిలపడం ఎంతవరకు సురక్షితం? వాహనాలను పార్కింగ్ చేసి సినిమా చూసేందుకు వెళ్లిన ప్రేక్షకులు తిరిగి వచ్చేసరికి ఏదైనా పెచ్చు వాహనంపై పడితే నష్టం ఎవరు భరిస్తారు? అదే పెచ్చు మనిషిపై పడితే బాధ్యత ఎవరిది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. భవనం బయటకు చూడటానికి బాగానే కనిపించినా లోపలి నిర్మాణ పరిస్థితులు ఎలా ఉన్నాయన్నది సాంకేతిక నిపుణుల తనిఖీల ద్వారానే తేలుతుంది. అందువల్ల సెల్లార్ పైకప్పు, పిల్లర్లు, గోడల పరిస్థితిని సంబంధిత అధికారులు పరిశీలించాలి. భవన నిర్మాణ పటిష్ఠతపై అనుమానాలు ఉంటే నిపుణులతో తనిఖీ చేయించి, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలి. మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టాలి. అవసరమైన భద్రతా చర్యలు తీసుకునే వరకు ప్రమాదకర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌ను కొనసాగించాలా? అన్న అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలి. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే.. ముందుగానే మేల్కొనడం మేలు కాదా?

## సెల్లార్ కాదు.. మురుగునీటి కొలను

పార్కింగ్ ప్రాంతంలో మరో సమస్య నీటి నిల్వ. సెల్లార్ నేలపై వర్షపు నీరు, మురుగునీరు నిలిచిపోయి బురదమయంగా మారిందని ప్రేక్షకులు చెబుతున్నారు. వాహనాలను నిలిపేందుకు వచ్చినవారు నీటిలోనే నడవాల్సి వస్తోందని, వాహనాలను బయటకు తీసుకురావడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. పార్కింగ్ స్థలంలో నీరు నిల్వ ఉండటం వల్ల వాహనదారులకు అసౌకర్యం కలగడమే కాకుండా, జారిపడే ప్రమాదం కూడా ఉంటుంది. నీరు మురుగునీరైతే పారిశుద్ధ్య సమస్యలు మరింత తీవ్రమవుతాయి. సెల్లార్‌లో నీరు ఎక్కడి నుంచి వస్తోంది? వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ ఉందా? మురుగునీరు పార్కింగ్ ప్రాంతంలోకి ఎందుకు చేరుతోంది? నీటిని బయటకు పంపే ఏర్పాట్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? అన్న అంశాలపై అధికారులు దృష్టి సారించాలి.

థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులు పార్కింగ్ రుసుము చెల్లిస్తున్నది వాహనాన్ని ఎక్కడో నిలిపేందుకు మాత్రమే కాదు.. కనీసం సురక్షితమైన, పరిశుభ్రమైన ప్రదేశంలో నిలిపేందుకు కూడా.



అలాంటప్పుడు నీటితో నిండిన సెల్లార్‌లో వాహనాలను నిలిపే పరిస్థితి ఎందుకు ఏర్పడుతోంది? పార్కింగ్ నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే దాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత నిర్వాహకులపై లేదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

## బైక్‌కు రూ.30.. కారుకు రూ.50

పార్కింగ్ రుసుముల వసూళ్లపైనా ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.30, కారుకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వసూలు చేస్తున్న మొత్తానికి తగిన సౌకర్యాలు కల్పించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక కుటుంబం కారులో సినిమా చూసేందుకు వస్తే పార్కింగ్ రుసుము రూపంలో రూ.50 చెల్లించాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనంపై వచ్చినా రూ.30 చెల్లించక తప్పడం లేదని ప్రేక్షకులు అంటున్నారు. అయితే, రుసుములు వసూలు చేస్తున్నప్పుడు పార్కింగ్ ప్రదేశాన్ని సురక్షితంగా, పరిశుభ్రంగా ఉంచడం నిర్వాహకుల బాధ్యత కాదా? అన్నది ప్రధాన ప్రశ్న. వసూలు చేస్తున్న రుసుములు సంబంధిత నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? వాటికి అనుమతులు ఉన్నాయా? రుసుముల వివరాలను ప్రేక్షకులకు స్పష్టంగా తెలియజేస్తున్నారా? టికెట్లపై ముద్రించిన నిబంధనలు ఏమిటి? అన్న అంశాలపై అధికారులు విచారణ జరపాలి. పార్కింగ్ రుసుముల విషయంలో వర్తించే నిబంధనలను పరిశీలించి, ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలి.

## 'సామాన్లకు మా బాధ్యత లేదు'.. ఇదేం నిబంధన?

పార్కింగ్ టికెట్‌పై 'వాహనాలపై గల సామాన్లకు మా బాధ్యత లేదు' అనే నిబంధన ముద్రించి ఉంటోందని ప్రేక్షకులు చెబుతున్నారు. పార్కింగ్ రుసుము వసూలు చేస్తూ మరోవైపు బాధ్యత నుంచి తప్పించుకునేలా నిబంధనలు ముద్రిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, టికెట్‌పై ఏదైనా నిబంధన ముద్రించినంత మాత్రాన నిర్వాహకుల చట్టపరమైన బాధ్యతలన్నీ తొలగిపోతాయని భావించలేం. వాస్తవ పరిస్థితులు, వర్తించే చట్టాలు, నిబంధనల ఆధారంగా బాధ్యతను నిర్ణయించాల్సి ఉంటుంది. అందువల్ల పార్కింగ్ టికెట్‌పై ముద్రించిన నిబంధనలను కూడా సంబంధిత అధికారులు పరిశీలించాలి. పార్కింగ్ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? వాహనాలకు రక్షణ కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? వాహనదారుల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉందా? అన్న ప్రశ్నలకు నిర్వాహకులు సమాధానం చెప్పాలి. రుసుములు వసూలు చేసే విషయంలో ఉన్న శ్రద్ధ.. సౌకర్యాల కల్పనలోనూ కనిపించాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

## నగరపాలక సంస్థ ఏం చేస్తోంది.?

నగరంలోని ప్రముఖ థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందిన అలంకార్ థియేటర్ పార్కింగ్ ప్రాంతంపై ఇలాంటి ఆరోపణలు రావడం సంబంధిత అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. భవనాల భద్రత, పారిశుద్ధ్యం, నీటి నిల్వ, పార్కింగ్ నిర్వహణ వంటి అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత సంబంధిత విభాగాలపై ఉంది. విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు ఈ ప్రాంతాన్ని తనిఖీ చేశారా? భవన నిర్మాణ పటిష్ఠతపై ఏమైనా పరిశీలనలు జరిగాయా? సెల్లార్‌లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గతంలో సూచించారా? పార్కింగ్ రుసుములపై ఫిర్యాదులు అందాయా? అందితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

అలాగే, భవన భద్రతకు సంబంధించిన అనుమతులు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, పార్కింగ్ ఏర్పాట్లకు వర్తించే నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా అన్నది సంబంధిత శాఖలు పరిశీలించాలి. అవసరమైతే నగరపాలక సంస్థ, అగ్నిమాపక శాఖ, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో తనిఖీలు చేపట్టాలి.

## ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే సినిమా థియేటర్లలో భద్రతా ప్రమాణాలు పాటించడం అత్యంత కీలకం. ముఖ్యంగా వాహనాలు నిలిపే సెల్లార్ వంటి ప్రదేశాల్లో పైకప్పు పటిష్ఠత, తగిన వెలుతురు, నీటి పారుదల, పారిశుద్ధ్యం వంటి అంశాలు సక్రమంగా ఉండాలి. వీటిలో ఏ లోపం ఉన్నా వెంటనే సరిదిద్దాలి. అలంకార్ థియేటర్ పార్కింగ్ ప్రాంతంపై వస్తున్న ఆరోపణలు నిజమో కాదో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టత ఇవ్వాలి. లోపాలు గుర్తిస్తే నిర్వాహకులకు తగిన ఆదేశాలు జారీ చేయాలి. ప్రమాదకర పరిస్థితులు ఉన్నట్లు తేలితే ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలి. పార్కింగ్ రుసుముల వసూళ్లపైనా నిబంధనల ప్రకారం విచారణ జరపాలి. థియేటర్ యాజమాన్యం కూడా ఈ ఆరోపణలపై స్పందించి, పార్కింగ్ ప్రదేశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. పైకప్పు, గోడల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలి. సెల్లార్‌లో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రేక్షకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలను పార్కింగ్ చేసుకునేలా సదుపాయాలు మెరుగుపరచాలి.

# ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్**





దిల్‌సుఖ్‌నగర్ (ప్రశ్న న్యూస్) దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం ప్రాంతంలో 26వ అమ్మవారి వార్షికోత్సవం, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ రాపోలు భాస్కర్, తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అరిగే ఐలేష్ కుర్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో రాచకొండ సతీష్, ఎలిమినేటి ప్రవీణ్ గౌడ్, ఎలిమినేటి మధు గౌడ్, ఎలిమినేటి జంగా గౌడ్, చేగూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముఖ్య అతిథుల రాకతో నిర్వాహకులు, భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రతి సంవత్సరం అమ్మవారి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ భక్తి భావాన్ని, ఆధ్యాత్మికతను పెంపొందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన నిర్వాహకులను అభినందించారు.

# మన ఆహారం మన ఆరోగ్యం మన భవిష్యత్తు




మనిషి ఆరోగ్యానికి ఆహారమే పునాది. మనం తినే ఆహారం ఎక్కడ పండింది ఎలా పండింది అనే విషయాలపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి. నేల ఆరోగ్యం కాపాడబడితేనే ప్రకృతి సమతుల్యత నిలుస్తుంది. ప్రకృతి బాగుంటేనే మన భవిష్యత్తు బాగుంటుంది. అధికంగా రసాయన ఎరువులు పురుగుమందులు వినియోగించడం వల్ల నేల నీటి నాణ్యత పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉంది. అందుకే నేల సారాన్ని కాపాడుతూ జీవవైవిధ్యాన్ని పెంపొందించే సేంద్రీయ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. 2014లో ప్రచురితమైన ఒక పరిశోధనా సమీక్షలో 343 శాస్త్రీయ ప్రచురణలను విశ్లేషించగా పరిశీలించిన నమూనాల్లో పురుగుమందుల అవశేషాలు సేంద్రీయ పంటల్లో సుమారు 11 శాతం ఉండగా సంప్రదాయ పద్ధతుల్లో పండించిన పంటల్లో సుమారు 46 శాతం ఉన్నట్లు నివేదించారు. ఇవి ఆ పరిశోధనలోని నమూనాలకు సంబంధించిన గణాంకాలు మాత్రమే. సేంద్రీయ ఆహారం అన్ని వ్యాధులను నివారిస్తుందని చెప్పలేకపోయినా కొన్ని పురుగుమందుల అవశేషాలకు గురయ్యే అవకాశాన్ని తగ్గించుకోవడానికి ఇది ఒక మార్గం కావచ్చు. ప్రకృతి అనుకూల వ్యవసాయం చేస్తున్న రైతులు నేలను మెరుగుపరచడానికి పంటలను కాపాడడానికి ఎన్నో కష్టాలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో దిగుబడి తగ్గవచ్చు. మార్కెట్ లభ్యత ధరల విషయంలోనూ సమస్యలు ఎదురవుతాయి. ప్రకృతిని కాపాడే బాధ్యత రైతులదేనా వినియోగదారులకు బాధ్యత లేదా. రైతుకు న్యాయమైన ధర లభించాలి. వినియోగదారుడికి నాణ్యమైన ఆహారం అందాలి. అందుకోసం ఉత్పత్తి ఎక్కడ పండింది ఎవరు పండించారు ఏ పద్ధతులు అనుసరించారు అనే వివరాలు పారదర్శకంగా ఉండాలి. నమ్మకం మాటలతో కాదు నిజాయితీతో కూడిన ఆచరణతో ఏర్పడుతుంది. మనకు వీలైనంతవరకు ఇంట్లో కూరగాయలు ఔషధ మొక్కలు పెంచుకుందాం. స్థానిక రైతుల నుంచి నేరుగా ఆహారాన్ని కొనుగోలు చేద్దాం. వారి కష్టాన్ని గుర్తించి న్యాయమైన ధర అందిద్దాం. ఆరోగ్యకరమైన ఆహారం సమతుల్యమైన జీవనశైలికి తోడ్పడుతుంది. అవసరమైన వైద్య చికిత్సలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ప్రకృతి పరిరక్షణ ప్రభుత్వానిదో రైతులదో మాత్రమే బాధ్యత కాదు. మనందరి బాధ్యత. మన పిల్లలకు ఆస్తులతో పాటు ఆరోగ్యకరమైన నేలను మంచి ఆహారాన్ని స్వచ్ఛమైన ప్రకృతిని వారసత్వంగా అందిద్దాం. రండి మనమందరం ఒక్క అడుగు ముందుకు వేద్దాం. ప్రకృతి అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం. రైతులను ఆదుకుందాం. మన ఆహారం గురించి తెలుసుకుందాం. మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో మార్పు తీసుకువద్దాం.



**సింహాచలం లక్ష్మణ స్వామి వ్యవస్థాపక అధ్యక్షులు**
**ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం**
**వీరాంజనేయ హెర్బల్ రీసెర్చ్ సెంటర్ నారపల్లి హైదరాబాద్ 90001 87858**

# పారిపోయింది నేను కాదు.. నువ్వే వంశీ

**పారిపోయింది నేను కాదు.. నువ్వే వంశీ**

**- ఓడిపోయినా గన్నవరం వచ్చి గెలిచా.. - నన్ను పారిపోయానంటావా.?**

**- వల్లభనేని వంశీపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిప్పులు**



గన్నవరం(ప్రశ్న న్యూస్) గన్నవరం రాజకీయాల్లో మరోసారి మాటల మంటలు చెలరేగాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేసిన వ్యాఖ్యలకు ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఘాటుగా బదులిచ్చారు. తాను నియోజకవర్గం నుంచి పారిపోయానంటూ వంశీ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ.. ఓడిపోయిన తర్వాత కూడా గన్నవరం వచ్చి ప్రజల మధ్య నిలబడి గెలిచిన తనను పట్టుకుని పారిపోయానని ఎలా అంటారని ప్రశ్నించారు. రాజకీయాల్లో విమర్శలకు హద్దులుండాలని, వ్యక్తిగత దూషణలు తనకు అలవాటు లేదని స్పష్టం చేశారు. నిడమానూరు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన వంశీతో పాటు మాజీ మంత్రి కొడాలి నానిపైనా పలు విమర్శలు చేశారు.

టికెట్ రాక విజయవాడకు వెళ్లింది నువ్వే కదా.

గన్నవరం నుంచి తాను పారిపోయానని వంశీ వ్యాఖ్యానించడంపై యార్లగడ్డ తీవ్రంగా స్పందించారు. 2009లో గన్నవరం నుంచి టీడీపీ తరపున పోటీ చేయాలని భావించిన వంశీకి టికెట్ దక్కకపోవడంతో విజయవాడ పార్లమెంట్ స్థానానికి వెళ్లి పోటీ చేశారని గుర్తుచేశారు. అలాంటప్పుడు తాను పారిపోయానని విమర్శించే నైతిక హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా మళ్లీ గన్నవరం వచ్చి ప్రజల మద్దతుతో విజయం సాధించానని పేర్కొన్నారు. 'ఒక్కసారి టచ్ చేస్తేనే ఈ నియోజకవర్గంలో నాయకులందరూ పారిపోయారు. అలాంటిది నన్ను పారిపోయానంటావా.?' అంటూ వంశీ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. గతంలో ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేశారు? ఎవరు ఎక్కడికి వెళ్లారు.? అన్న విషయాలను గుర్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయ విమర్శలు చేసే ముందు గతాన్ని కూడా పరిశీలించుకోవాలని హితవు పలికారు.

# సక్సెషన్‌కు రూ.5 లక్షల లంచం డిమాండ్

**రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీకి**

**చిక్కిన ముగ్గురు రెవెన్యూ అధికారులు**

**కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణపై ఏసీబీ చర్యలు.**



కిసర (ప్రశ్న న్యూస్) భూమి సక్సెషన్ ప్రక్రియ పూర్తిచేసేందుకు రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసి, అందులో మొదటి విడతగా రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ముగ్గురు రెవెన్యూ అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడినట్లు సమాచారం. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణ ఈ వ్యవహారంలో ఏసీబీకి చిక్కినట్లు తెలిసింది.

### మూడు ఎకరాల భూమి సక్సెషన్ కోసం..

వివరాల్లోకి వెళితే.. కీసరకు చెందిన పన్నాల బుచ్చిరెడ్డి భార్య పన్నాల సుశీల ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె పేరు మీద ఉన్న సర్వే నంబర్లు 183, 184లోని మూడు ఎకరాల భూమిని సక్సెషన్ ద్వారా తన పేరుపైకి మార్చుకునేందుకు పన్నాల గిరిధర్ రెడ్డి సంబంధిత రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదించారు. అయితే, సదరు భూమి 22ఏ జాబితాలో ఉందని పేర్కొంటూ, సక్సెషన్ ప్రక్రియ పూర్తిచేసేందుకు డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించాలంటే తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీవో కార్యాలయంలోనూ డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని బాధితుడికి చెప్పినట్లు సమాచారం.

### నగదు చేతులు మారుతుండగా ఏసీబీ దాడి..

ఈ నేపథ్యంలో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఏసీబీ పథకంలో భాగంగా మొదటగా రూ.2.50 లక్షలను కీసర తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డికి అందజేసినట్లు సమాచారం. అనంతరం ఆయన ఆ నగదును రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణకు అప్పగించగా, బాలకృష్ణ ఆ డబ్బును డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి గదిలోకి తీసుకెళ్లి ఆయన బ్యాగులో పెడుతున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందాల్సిన సేవల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. భూముల సక్సెషన్, రికార్డుల మార్పిడి వంటి కీలకమైన రెవెన్యూ సేవల విషయంలో ఇలాంటి ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావుద్యా శ్రీదేవి రమేష్ , వైస్ చైర్‌పర్సన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, మహిళల ఐక్యతను చాటే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మున్సిపల్ అధికారులు కోరారు.

# డా. గంగా సాగర్‌కు బీజేపీలో కీలక బాధ్యతలు

**జగిత్యాల జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్‌గా నియామకం**

**నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు**



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో పిల్లల వైద్య నిపుణులుగా సేవలందిస్తున్న డా. గంగా సాగర్‌కు భారతీయ జనతా పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఆయనను జగిత్యాల జిల్లా బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్‌గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్‌గా తనకు బాధ్యతలు అప్పగించినందుకు డా. గంగా సాగర్ హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు, పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్, రాష్ట్ర బీజేపీ మెడికల్ సెల్ డాక్టర్ల కన్వీనర్ డా. రాజశేఖర్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు

# మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లో బతుకమ్మ సంబరాలు

**బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక.**

**ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల సాధికారతకు, సమాజంలో వారి పాత్రకు ప్రతీక"**

**బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచిక.**







మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా యంత్రాంగం తరపున శుక్రవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, డిఆర్డిఓ, జిల్లా అగ్రికల్చర్, జిల్లా హార్టికల్చర్, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ సతీమణి రాధా, డిప్యూటి కలెక్టర్లు మోక్షిత, బరీరా ఫరీద్, లా ఆఫిసర్ చంద్రావతి, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్టీ సంక్షమ శాఖాధికారి పద్మజా, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ చంద్రకళ, ఎస్టిఓ అలివేలుమంగ, ఎంతో ఉత్సహాంగా బతుకమ్మలు ఆడారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, కలెక్టరేట్ మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారధులు పాడిన పాటలు అందరిని ఆకర్షించాయి.

# నవరాత్రుల ఆరో రోజు.. కాత్యాయనీ అమ్మవారి అవతారం విశిష్టత

**దుష్టశక్తుల సంహారిణిగా ఆదిశక్తి.. ధైర్యం, ధర్మం, విజయానికి ప్రతీకగా కాత్యాయనీ దేవి**

(ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న )నవరాత్రి ఉత్సవాల్లో ఆరో రోజుకు ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. నవదుర్గలలో ఆరో రూపమైన కాత్యాయనీ అమ్మవారిని ఈ రోజున భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. దుష్టశక్తులను సంహరించి ధర్మాన్ని కాపాడే శక్తిస్వరూపిణిగా, భక్తులకు ధైర్యాన్ని ప్రసాదించే జగన్మాతగా కాత్యాయనీ దేవిని కొలుస్తారు. అన్యాయంపై న్యాయం, అధర్మంపై ధర్మం సాధించే విజయానికి అమ్మవారి అవతారం ప్రతీకగా నిలుస్తుంది.

### కాత్యాయనీ అనే పేరు వెనుక పురాణ గాథ

పురాణ కథనాల ప్రకారం, కాత్యాయన మహర్షి అమ్మవారిని తన కుమార్తెగా పొందాలని తపస్సు చేశారు. ఆయన తపస్సుకు మెచ్చిన ఆదిశక్తి ఆయనకు కుమార్తెగా అవతరించిందని, అందుకే ఆమెకు కాత్యాయనీ అనే పేరు వచ్చిందని చెబుతారు. మరో పురాణ గాథ ప్రకారం, మహిషాసురుడు అనే రాక్షసుడు తన దుష్టచర్యలతో దేవతలను, లోకాలను బాధించేవాడు. అతని ఆగడాలను అరికట్టేందుకు దేవతల శక్తులన్నీ ఏకమై దుర్గాదేవి రూపంలో అవతరించాయి. ఆ దివ్యశక్తి మహిషాసురుడితో యుద్ధం చేసి అతడిని సంహరించినట్లు పురాణాలు వివరిస్తాయి. ఈ గాథలో కాత్యాయనీ దేవి ధర్మరక్షణకు, దుష్టశక్తుల నిర్మూలనకు ప్రతీకగా నిలుస్తుంది.

### అమ్మవారి దివ్యరూపం.. విశిష్టత

కాత్యాయనీ అమ్మవారు సింహవాహనంపై ఆసీనురాలై దర్శనమిస్తారు. సాధారణంగా నాలుగు చేతులతో చిత్రించబడే ఈ రూపంలో రెండు చేతుల్లో ఆయుధాలు, మరో రెండు చేతుల్లో అభయముద్ర, వరదముద్రలు కనిపిస్తాయి. కొన్ని సంప్రదాయ చిత్రణల్లో ఆయుధాలు, చేతుల అమరికలో మార్పులు ఉంటాయి. అమ్మవారి చేతుల్లోని ఆయుధాలు దుష్టశక్తులపై పోరాటానికి సంకేతాలు. అభయముద్ర భక్తులకు రక్షణను, వరదముద్ర కరుణను, అనుగ్రహాన్ని సూచిస్తాయి. సింహవాహనం ధైర్యం, పరాక్రమం, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది.

### ఆరో రోజు పూజల విశిష్టత

నవరాత్రుల ఆరో రోజున భక్తులు కాత్యాయనీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుష్పార్చన, దీపారాధన, నైవేద్య సమర్పణతో పాటు అమ్మవారి నామస్మరణ, మంత్రపఠనం, ధ్యానం చేస్తారు. కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్యం, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థిస్తారు. కాత్యాయనీ దేవిని ఆరాధించడం వల్ల ధైర్యం, ఆత్మవిశ్వాసం, మనోబలం పెరుగుతాయని భక్తుల విశ్వాసం. వివాహ సంబంధమైన కోరికల కోసం కూడా చాలామంది ఈ అమ్మవారిని భక్తితో పూజిస్తారు. ముఖ్యంగా శ్రీకృష్ణుడిని భర్తగా పొందాలని వ్రతం ఆచరించిన గోపికల కథ భాగవత సంప్రదాయంలో ప్రసిద్ధి చెందింది. అయితే పూజా విధానాలు, ఆచారాలు ప్రాంతీయ సంప్రదాయాలను బట్టి మారవచ్చు.

### నేటి సమాజానికి అమ్మవారి సందేశం

కాత్యాయనీ అమ్మవారి అవతారం నేటి సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తుంది. అన్యాయం ఎదురైనప్పుడు భయంతో వెనక్కి తగ్గకుండా ధైర్యంగా నిలబడాలి. బలహీనులపై దాడులు, మహిళలపై వేధింపులు, సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నించాలి. అదే సమయంలో కోపం, ద్వేషాలకు లోనుకాకుండా వివేకంతో వ్యవహరించాలి.

మహిళల గౌరవం, భద్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆడపిల్లలకు విద్య, ఆత్మవిశ్వాసం, సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజాన్ని మరింత బలోపేతం చేయవచ్చు. శక్తి అంటే కేవలం బలం మాత్రమే కాదు.. అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం, నిజం వైపు నిలబడే నిబద్ధత కూడా అని కాత్యాయనీ అమ్మవారి రూపం గుర్తుచేస్తుంది.

### ధర్మవిజయానికి ప్రతీకగా కాత్యాయనీ దేవి



నవరాత్రుల ఆరో రోజున కాత్యాయనీ అమ్మవారిని ఆరాధించడం ద్వారా భక్తులు తమ జీవితాల్లో ధైర్యం, శక్తి, విజయాన్ని కోరుకుంటారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించే విజయానికి అమ్మవారి అవతారం స్ఫూర్తినిస్తుంది. ప్రతి ఒక్కరూ తమలోని భయాన్ని తొలగించుకుని, నిజాయితీతో జీవిస్తూ, ఇతరులకు సహాయం చేస్తూ, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని పెంపొందించుకోవాలి. ఇదే కాత్యాయనీ అమ్మవారి ఆరాధనలోని

## దసరా వేళ సేవా కార్యక్రమాలతో

# ఆదర్శంగా గిరి బ్రదర్స్

**పేదలకు అన్నదానం.. పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ**

**ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్ యాజమాన్యం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) దసరా పండుగను పురస్కరించుకుని ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్ యాజమాన్యం గిరి బ్రదర్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గిరి నరసింహ, గిరి మహేశ్ నేతృత్వంలో పేదలకు అన్నదానం చేయడంతో పాటు పట్టణ పరిశుభ్రతకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. పండుగ వేళ పేదలకు ఆహారం అందించి, పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ద్వారా గిరి బ్రదర్స్ తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్మికుల సేవలను గుర్తించి వస్త్రాలు పంపిణీ చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు, సంఘం ప్రతినిధులు గిరి బ్రదర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రతి నెలా పేదలకు అన్నదానం

ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్‌లో గిరి బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోనూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పండుగలకే పరిమితం కాకుండా నిరంతరం పేదలకు అండగా నిలుస్తూ, సమాజ సేవలో భాగస్వాములవుతున్న గిరి బ్రదర్స్‌ను స్థానికులు అభినందించారు.

# హబ్సిగూడ బీజేపీ అధ్యక్షుడిగా చింతకింది ప్రవీణ్‌కు ఘన సన్మానం

**కష్టపడ్డ కార్యకర్తకు బీజేపీలోనే సముచిత గుర్తింపు**

**వారసత్వ రాజకీయాలకు బీజేపీలో తావులేదు**

**- పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు**

**ఊసరవెల్లి రాజకీయాలకు బీజేపీలో చోటు లేదు**



ఉప్పల్(ప్రశ్న న్యూస్) హబ్సిగూడ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన చింతకింది ప్రవీణ్‌కు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ నివాసం వద్ద ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మాట్లాడుతూ, చింతకింది ప్రవీణ్ చిన్న వయసు నుంచే పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ, కష్టపడి ఎదిగిన కార్యకర్త అని కొనియాడారు. హబ్సిగూడ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి ప్రవీణ్ తన నాయకత్వంతో మరింత కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో డివిజన్‌లో బీజేపీ మరింత బలపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### కష్టపడే కార్యకర్తకే గుర్తింపు

అనంతరం నూతన అధ్యక్షుడు చింతకింది ప్రవీణ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రయాణంలో అండగా నిలిచిన ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్‌కు, పద్మశాలి సంఘం నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, కార్యకర్తలను కలుపుకొని హబ్సిగూడ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పార్టీ జెండాను మోస్తూ, ప్రజల మధ్య ఉంటూ నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు బీజేపీలో తగిన గుర్తింపు లభిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, వివిధ సంఘాల నేతలు, డివిజన్ నాయకులు, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు, బిజెపి కార్యకర్తలు, పద్మశాలి కుల బాంధవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘట్కేసర్ సీఐ బాలస్వామిపై సస్పెన్షన్ వేటు.?

- సివిల్ వివాదాల్లో జోక్యం, అవినీతి ఆరోపణలపై విచారణ.?
- మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆదేశాలతో విచారణ జరిగినట్లు సమాచారం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ సీఐ బాలస్వామిపై సస్పెన్షన్ వేటు పడినట్లు పోలీసు వర్గాల్లో సమాచారం వెలువడింది. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోవడం, అవినీతి వ్యవహారాలు, విధి నిర్వహణలో అలసత్వం వంటి అంశాలకు సంబంధించి ఆయనపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు సమాచారం. విచారణలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో బాలస్వామిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయంపై పోలీసు శాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో సస్పెన్షన్‌కు సంబంధించిన పూర్తి వివరాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

### సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యంపై ప్రశ్నలు..

సివిల్ వివాదాలు సాధారణంగా న్యాయస్థానాలు లేదా సంబంధిత చట్టబద్ధ అధికారుల పరిధిలో పరిష్కరించాల్సిన అంశాలు. ఇలాంటి వివాదాల్లో పోలీసుల జోక్యం, విధి నిర్వహణలో పారదర్శకత, అధికార దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదులు వచ్చినప్పుడు ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. సీఐ బాలస్వామిపై వచ్చినట్లు చెబుతున్న ఆరోపణలపై అధికారిక విచారణ వివరాలు వెల్లడైతే వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

### దసరా సమయంలో మరోసారి చర్చనీయాంశం

గతంలో ఘట్కేసర్ సీఐగా పనిచేసిన మరో అధికారి కూడా దసరా పండుగ సమయంలోనే సస్పెన్షన్‌కు గురైనట్లు సమాచారం. తాజాగా బాలస్వామిపై సస్పెన్షన్ వార్తలు వెలువడటంతో ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.అయితే ప్రస్తుత సస్పెన్షన్ వార్తపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. పోలీసు శాఖ ప్రకటన వెలువడిన తర్వాతే చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆరోపణల స్వరూపం, విచారణ ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సరస్ మేళాలో గంగపుత్ర మహిళ స్వయం ఉపాధికి ప్రశంసలు

- మొబైల్ ఫిష్ ఫుడ్ అవుట్‌లెట్‌ను సందర్శించి నిర్వాహకురాలు దుబ్బాక గంగమణి గంగపుత్రను అభినందించిన టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ మైదానంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్ మేళాను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర సందర్శించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా మల్లారం గ్రామానికి చెందిన సాంప్రదాయ మత్స్యకార గంగపుత్ర మహిళ దుబ్బాక గంగమణి గంగపుత్ర నిర్వహిస్తున్న మొబైల్ ఫిష్ ఫుడ్ అవుట్‌లెట్‌ను ఆయన ప్రత్యేకంగా సందర్శించారు చేపలతో రుచికరమైన వంటకాలను తయారు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్న గంగమణిని గంగపుత్ర అభినందించారు. అనంతరం రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ గంగపుత్ర మహిళలు తమ సంప్రదాయ వృత్తి నైపుణ్యాన్ని ఆధారంగా చేసుకుని చేపల వంటకాల తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందడం అభినందనీయమని అన్నారు ఇటువంటి కార్యక్రమాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మొబైల్ ఫిష్ ఫుడ్ అవుట్‌లెట్ ఏర్పాటుకు అవకాశం కల్పించిన తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖకు పేదరిక నిర్మూలన సంస్థకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు తెలంగాణ గంగపుత్ర సంఘం తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాంప్రదాయ మత్స్యకార కుటుంబాలకు చెందిన మహిళలు ఆధునిక ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగడం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# సిబ్బంది కొరతతో పట్టణ ప్రణాళిక పనులకు ఆటంకం




**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** మియాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్లలో పట్టణ ప్రణాళిక సిబ్బంది కొరతతో రహదారుల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, నిర్మాణ అనుమతుల పరిశీలన వంటి పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. రెండు సర్కిళ్ల బాధ్యతలను పరిమిత సిబ్బందితో నిర్వహించాల్సి రావడంతో క్షేత్రస్థాయి తనిఖీలు, సర్వేలు, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరిగే అవకాశం ఉంది.సిబ్బంది కొరతతో అందుబాటులో ఉన్న అధికారులపై పని ఒత్తిడి పెరుగుతోందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో రెండు సర్కిళ్లకు వేర్వేరుగా పట్టణ ప్రణాళిక పర్యవేక్షకులను నియమించడంతోపాటు, అవసరమైన క్షేత్రస్థాయి సిబ్బందిని కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది కొరతను పరిష్కరిస్తే ప్రజలకు సకాలంలో సేవలు అందే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### 30 ఏళ్ల మహిళను లవ్ మ్యారేజ్ చేసుకున్న

# 75 ఏళ్ల వృద్ధుడు

- ప్రేమ ముందు వయసు బలాదూర్



**ఔరాయా (ప్రశ్న న్యూస్)** ప్రేమకు.. పెళ్లికి ఏజ్ అడ్డు రాదని నిరూపించాడు ఆ వృద్ధుడు. కృష్ణా రామా అనుకోవాల్సిన వయసులో 30 ఏళ్ల మహిళను ప్రేమించాడు. వృద్ధుడి ప్రేమను ఆమె అంగీకరించింది. దాంతో ఇరువురూ సంవత్సరం పాటు ప్రేమించుకున్నారు. ఇప్పుడు పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోబోతున్నారు. తాజాగా వారి ఎంగేజ్ మెంట్ పూర్తయింది. నవరాత్రి తర్వాత పెళ్లి జరగనుంది. అయితే ఈ అంశం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. కొందరు ఆ జంటకు సపోర్ట్ గా కామెంట్స్ పెడుతున్నారు. మరికొందరు విమర్శిస్తూ కామెంట్స్ పెడుతున్నారు. ఇక ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్ లోని ఔరాయాలో జరిగింది.స్థానిక కథనాల ప్రకారం ఔరాయాకు చెందిన రామ్ సుగార్ వయసు 75 ఏళ్లు. ఆయన తన ప్రాంతానికే చెందిన 30 ఏళ్ల రాణి రాజ్ పుత్ ను వివాహం చేసుకోబోతున్నాడు. ఇరువురూ సంవత్సరం కాలంగా ప్రేమించుకుంటున్నారు. తాజాగా వారి ఎంగేజ్ మెంట్ పూర్తికాగా నవరాత్రి తర్వాత పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. అయితే రాణి ఇన్ స్టాగ్రామ్ లో రీల్స్ చేస్తూ ఉంటుంది. రామ్ సుగార్ కుమార్తెను కలిసేందుకు తరచూ అతని ఇంటికి వెళ్తుంటుంది. ఈ క్రమంలో రామ్ సుగార్- రాణిల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అలా వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు. అలా వారి ప్రేమ, పెళ్లి వరకూ వచ్చింది. ఇక తాజాగా వీరి ఎంగేజ్ మెంట్ కు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.ఆ వీడియోలో రామ్ సుగార్- రాణి ఇద్దరూ సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. వారి చుట్టూ ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులు కూడా సంతోషంగానే ఉన్నట్లు వీడియోలో స్పష్టం అవుతోంది. ఇక వీరిద్దరి మధ్య దాదాపు 45 సంవత్సరాలు గ్యాప్ ఉన్న క్రమంలో వీరి స్టోరీ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ అంశంపై నెటిజన్లు పలు విధాలుగా కామెంట్స్ చేస్తున్నారు. కొత్త దంపతులకు శుభాకాంక్షలు అని ఓ యూజర్ కామెంట్ చేయగా అతను రామ్ సుగర్ కాదు షుగర్ డాడీ అని మరో యూజర్ కామెంట్ పెట్టాడు. మరో యూజర్ ప్రేమ నిజంగా గుడ్డిదా.? అని కామెంట్ పెట్టాడు. మరో యూజర్ మాట్లాడుతూ ఆ ముసలివాడికి ఎంత ప్రాపర్టీ ఉందో అని కామెంట్ చేశాడు.

# కల్పవృక్షంపై కలియుగ దైవం

- బకాసుర వధ అలంకారంలో మలయప్పస్వామి దర్శనం
- భక్తిభావంతో పరవశించిన తిరుమల..
- భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక శోభ
- రాత్రి సర్వభూపాల వాహనంపై స్వామివారి విహారం



**తిరుమల(ప్రశ్న న్యూస్)** కల్పవృక్ష వాహనంపై కలియుగ దైవం కొలువుదీరాడు. బకాసుర వధ అలంకారంలో శ్రీ మలయప్పస్వామి ఉభయదేవేరులతో కలిసి భక్తులకు దర్శనమిచ్చారు. గజరాజుల గంభీర నడక.. మంగళవాయిద్యాల మధుర నాదం.. భక్తబృందాల భజనలు.. కోలాటాల సందడి.. జీయ్యంగార్ల ప్రబంధ పారాయణాల నడుమ తిరుమల మాడవీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీవారి వాహనసేవను తిలకించిన భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారి కృపాకటాక్షాలు పొందారు.
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం ఉదయం కల్పవృక్ష వాహనసేవ వైభవంగా జరిగింది. శ్రీ మలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దర్శనం కోసం మాడవీధులకు చేరుకున్న భక్తులతో పరిసరాలు సందడిగా మారాయి.

### కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షం

పురాణాల ప్రకారం క్షీరసాగర మథనంలో ఉద్భవించిన కల్పవృక్షం కోరిన కోర్కెలు తీర్చే దివ్య వృక్షంగా ప్రసిద్ధి చెందింది. అటువంటి కల్పవృక్ష వాహనంపై స్వామివారు విహరించడం విశేషంగా భావిస్తారు. ఈ వాహనంపై శ్రీవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని, అభీష్టాలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.
బకాసుర వధ అలంకారంలో స్వామివారి దర్శనం భక్తుల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. మాడవీధుల్లో సాగిన వాహనసేవలో గజరాజులు ముందు నడవగా, మంగళవాయిద్యాలు, భజన బృందాలు, కోలాట ప్రదర్శనలు ఉత్సవానికి మరింత వైభవాన్ని అద్దాయి. జీయ్యంగార్లు ప్రబంధ పారాయణం చేస్తూ స్వామివారి సేవలో పాల్గొన్నారు.

### రాత్రి సర్వభూపాల వాహనసేవ

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహనసేవ నిర్వహించనున్నారు. శ్రీ మలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సేవను తిలకించేందుకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లపై టీటీడీ అధికారులు దృష్టి సారించారు.

### ప్రముఖుల హాజరు

ఉదయం జరిగిన వాహనసేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవో గోపీనాథ్, సీవీఎస్‌వో మురళీకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నగరి మున్సిపాలిటీలో టీడీపీ జెండా ఎగరేద్దాం



**నగరి(ప్రశ్న న్యూస్ )** స్థానిక ఎన్నికలే లక్ష్యంగా నగరి రాజకీయాల్లో సమీకరణాలు మారుతున్నాయి. మున్సిపాలిటీతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధించేందుకు తెలుగుదేశం పార్టీ వ్యూహాలకు పదును పెడుతోంది. కేజే కుమార్, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు టీడీపీ కుటుంబంలోకి వస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కనపెట్టి సమిష్టిగా పనిచేస్తే నగరి మున్సిపాలిటీలో టీడీపీ జెండా ఎగురవేయడం సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు.నగరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కేజే కుమార్, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు నేటి నుంచి టీడీపీ కుటుంబ సభ్యులేనని ప్రకటించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో కేజే కుమార్ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు తెలిపారు. రానున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయనతో పాటు కుటుంబ సభ్యులు, అనుచరులు పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

### విభేదాలు పక్కనపెట్టి.. విజయమే లక్ష్యంగా..

నగరిలో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలని భానుప్రకాష్ పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభిప్రాయ భేదాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు.

### స్కందమాతగా భ్రమరాంబ..

# శేషవాహనంపై మల్లన్న

- శ్రీశైలంలో వైభవంగా దసరా నవరాత్రులు - ఐదో రోజు విశేష పూజలు..
- రాత్రి కాళరాత్రి పూజ, అమ్మవారి ఆస్థాన సేవ




**శ్రీశైలం(ప్రశ్న న్యూస్)** శ్రీశైల క్షేత్రంలో దసరా నవరాత్రి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శ్రీ భ్రమరాంబాదేవిని స్కందమాత స్వరూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మరోవైపు శ్రీ స్వామి అమ్మవార్లకు శేషవాహన సేవ జరిపించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. వేదమంత్రాలు, పారాయణలు, హోమాలు, అర్చనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలతో పాటు విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానాలు, చండీ పారాయణ, చతుర్వేద పారాయణలు జరిపించారు. కుమారీ పూజలతో పాటు స్వామివారికి రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు నిర్వహించారు.

### స్కందమాతగా అమ్మవారి దర్శనం

నవదుర్గ అలంకారాల్లో ఐదో రూపమైన స్కందమాతగా శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించారు. నాలుగు చేతులతో దర్శనమిచ్చే ఈ దేవి ఒక చేతిలో కుమారస్వామిని ధరించి, మిగిలిన చేతుల్లో పద్మాలు, అభయముద్రలతో భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారి ఒడిలో బాలుడి రూపంలో స్కందుడు కొలువై ఉంటాడు. స్కందుడి జనని కావడంతో ఈ రూపానికి స్కందమాత అనే పేరు ప్రసిద్ధి చెందింది.స్కందమాతను ఆరాధించడం వల్ల స్కందదేవుని అనుగ్రహం కూడా లభిస్తుందని భక్తుల విశ్వాసం. అమ్మవారి కృపతో సుఖశాంతులు, సౌభాగ్యం కలుగుతాయని భక్తులు నమ్ముతారు. నవరాత్రుల్లో రోజుకో రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం విశేషంగా భావిస్తారు.

### నవరాత్రుల్లో కుమారీ పూజకు ప్రత్యేకత

దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ కుమారీ పూజలు నిర్వహిస్తున్నారు. రెండు నుంచి పదేళ్ల వయస్సు ఉన్న బాలికలను దేవీ స్వరూపాలుగా భావించి పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజిస్తారు. శక్తి ఆరాధనలో కుమారీ పూజకు విశిష్ట స్థానం ఉందని ఆలయ సంప్రదాయాలు పేర్కొంటున్నాయి.

### శేషవాహనంపై స్వామి అమ్మవార్లు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ రోజు శ్రీ స్వామి అమ్మవార్లకు శేషవాహన సేవ నిర్వహించనున్నారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శేషవాహనంపై కొలువుదీర్చి పూజాదికాలు జరిపించనున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా ఉత్సవ ఏర్పాట్లు చేశారు.ం

### రాత్రి కాళరాత్రి పూజలు

సాయంత్రం జపాలు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటల నుంచి కాళరాత్రి పూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజలు జరగనున్నాయి. దసరా మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పూజలు, సేవలతో శ్రీశైల క్షేత్రం భక్తి పారవశ్యంలో మునిగిపోనుంది.

# స్థానిక పోరుకు పోలీసుల సన్నద్ధం

- ఎన్నికల భద్రతపై రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి సమీక్ష
- రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా.. పెండింగ్ వారెంట్ల అమలుకు ఆదేశాలు




**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలకు ఉపక్రమించింది. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పటిష్ఠ బందోబస్తు ప్రణాళిక రూపొందించాలని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం, అదనపు పోలీసు బలగాలను సమీకరించడం, నేర చరిత్ర ఉన్న వ్యక్తులపై నిఘా పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై గురువారం ఆయన విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల ఎస్పీలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, పోలవరం జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, పార్వతీపురం మన్యం ఎస్పీ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

### సమస్యాత్మక ప్రాంతాలపై గురి

ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని ఐజీ స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాలు, భద్రతాపరమైన అవసరాలను క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని సూచించారు. బందోబస్తుకు అవసరమైన పోలీసు సిబ్బంది సంఖ్యను ముందుగానే నిర్ధారించుకోవాలని, అవసరమైతే ఇతర జిల్లాల నుంచి అదనపు బలగాలను సమీకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.సిబ్బంది కేటాయింపు, విధుల విభజన, బలగాల మోహరింపు, రిజర్వు బలగాల అందుబాటు విషయంలో స్పష్టత ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో హింస, బెదిరింపులు, ఘర్షణలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే రిజర్వు బలగాలను వెంటనే రంగంలోకి దించేలా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

# సేవ చేయాల్సిన చేతులే, లంచం కోసం చాపుతున్న వైనం

## గవర్నమెంట్‌లో పనుందా,మనీతో రండి

- శాఖ ఏదైనా షాక్ ఒక్కటే, లక్షల్లో లంచం, ఏసిబి అధికారుల చిక్కుతున్న ప్రభుత్వ ఉద్యోగులు
- ప్రతి పనికో రేటు,విత్ డిస్కౌంట్,నవరాత్రుల ఆఫర్లు - చట్టాలతో మార్పులు రావు, అధికారుల అలవాట్లు మారాలి
- కాలరిగిన కదలని దస్త్రాలు, కరెన్సీ కట్టలు చూస్తేనే పరిగెత్తి అధికారులు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఏదో ఒక చోట ఏసిబి దాడులు నిర్వహిస్తుంటే చిన్న చాపలు కాదు ఏకంగా పెద్ద పెద్ద సొరచేపలే చిక్కుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కోట్లాది మంది ప్రజలు ఒకటే ఆశయంతో పోరాడారు."నీళ్ళు, నిధులు, ఉద్యోగాలు" అనే నినాదంతో సాగిన మహా ఉద్యమం వెనుక ప్రధాన ఉద్దేశం. స్వపరిపాలనలో సామాన్యుడికి కూడా సత్వర న్యాయం జరగాలనే!కానీ ఈరోజు సొంత రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే. అమరవీరుల ఆశయాలు గాలిలో దీపంలా మారుతున్నాయా అనే ఆందోళన కలుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవ చేసే దేవాలయాలుగా ఉండాల్సింది పోయి, బ్రోకర్లు,అవినీతి తిమింగలాలకు అడ్డాగా మారుతుండటం అత్యంత బాధాకరంగా ఉందని తెలంగాణ పోరాట యోధుల ఆవేదన.

### గవర్నమెంట్ ఆఫీసులో సేవ చేయాల్సిన చేతులు, లంచం కోసం చాపిన వైనం

గతంలో ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రజలకు సేవ చేసే పవిత్రమైన బాధ్యతగా భావించేవారు.కానీ ఈరోజుల్లో ఆ నిర్వచనం పూర్తిగా మారిపోయింది. పుట్టిన ధృవీకరణ పత్రం, డెత్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నా,భూమి మ్యుటేషన్ చేయాలన్నా, రేషన్ కార్డు కోసం దరఖాస్తు పెట్టుకున్నా.ప్రతీ చిన్న పనికీ రేట్లు ఫిక్స్ అయిపోతున్నాయి. 'ఇవ్వకపోతే ఫైల్ ముందుకు కదలదు'అనే అలిఖిత నిబంధన ప్రతీ ప్రభుత్వ శాఖలోనూ కనపడుతుంది. రెవెన్యూ,రిజిస్ట్రేషన్, మున్సిపల్,పోలీస్, విద్యుత్ వంటి శాఖలలో అయితే సామాన్యుడు లంచం ఇవ్వకుండా ఏ పని చేయించుకోలేని దుస్థితి నెలకొంది.

### పల్లె,పట్టణంలో సామాన్యుడి కన్నీటి గాథలు

వ్యవస్థలపై సడలుతున్న భరోసా,ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్న సామాన్యుడి గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పని కాకపోవడంతో,విసిగిపోయి జేబులో ఉన్న చివరి రూపాయిని కూడా లంచం రూపంలో సమర్పించుకోవాల్సిన దుస్థితి వస్తోంది.ఈ పరిణామాల వల్ల వ్యవస్థపై, ప్రభుత్వ యంత్రాంగం పై ప్రజల్లో ఉన్న కొద్దిపాటి నమ్మకం కూడా రోజు రోజుకూ సడలిపోతోంది. "ప్రభుత్వాలు మారుతున్నాయి,నేతలు మారుతున్నారు. కానీ ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు" సామాన్యుడు నిస్సహాయతతో నిట్టూరుస్తున్నాడు.

### అవినీతి బూజు పట్టిన శాఖలు,చర్యలు ఎక్కడ.?

అవినీతి నిరోధక శాఖ అధికారులు తరచూ దాడులు చేస్తూనే ఉన్నారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరుకుతున్న అధికారుల వార్తలు రోజూ చూస్తూనే ఉన్నాం.అయినా సరే,అవినీతి తిమింగలాల గుండెల్లో భయం ఏ కోశానా లేదు. ఒకరు దొరికితే, మరొకరు అదే దారిలో వెళ్తున్నారు.లంచం తీసుకున్న వారికి కేవలం సస్పెన్షన్లు,పైరవీలతో కొద్ది రోజుల తర్వాత మళ్లీ పోస్టింగ్‌లు ఇస్తే అవినీతి ఎలా అంతమవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా,అమలులో పారదర్శకత లోపించడం వల్లే ఉద్యోగుల కోర్కెలు పంచకళ్యానిలా ప్రజలపై దూసుకుపోతున్నాయి.

### కీసరలో కాలనాగులు, కరెన్సీ నోట్లతో ఖేల్ ఖతం.

ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలో కీసర మండలం పరిధిలో నిన్న ఏసిబి అధికారులు దాడులు నిర్వహించారు.కీసర డిప్యూటీ తహసిల్దార్ సందీప్ రెడ్డి,సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డి,రికార్డు అసిస్టెంట్ బాల కృష్ణని అదుపులోకి తీసుకున్న అనిశ అధికారులు.మేడ్చల్ జిల్లా కీసర తహసిల్దార్ కార్యాలయంలో"సక్సెషన్ ధృవ పత్రం"కోసం రూ.5 లక్షలు డిమాండ్ చేశారని రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నరు.వివరాల్లోకి వెళ్తే ఇటీవల కీసరకు చెందిన పన్నుల పన్నాల బుచ్చి రెడ్డి భార్య పన్నాల సుశీల మృతి చెందడంతో పన్నాల గిరిధర్ రెడ్డి అనే వ్యక్తి తన తల్లి పేరు మీద ఉన్న సర్వే నెంబర్: 183, 184 లో ఉన్న 3-ఎకరాల భూమిని సక్సెషన్ కోసం సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించచడు.ఎంతకి పని కాకపోవడంతో విసిగిపోయిన బాధితుడు అనిశ అధికారులను ఆశ్రయించాడని ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ అయితే ఈ భూమి 22ఏ లో ఉంది అని ఈ సక్సెషన్ పూర్తి చేసేందుకు సందీప్ రెడ్డి సుమారు రూ.5 లక్షలు డిమాండ్ చేశారు.22ఏ లో నుండి తీయాలి అంటే తహసిల్దార్ కి ఆర్డీఓ ఆఫీసులో సైతం డబ్బులు ఇవ్వాలి అని బాధితుడికి చెప్పడం జరిగింది.ఈ నేపథ్యంలో పన్నాల గిరిధర్ రెడ్డి రూ 2.50 లక్షలను మొదటగా ఎంఆర్ఓ కార్యాలయంలో విజయ్ కుమార్ రెడ్డికి అందజేసినట్లు సమాచారం.అనంతరం విజయ్ కుమార్ ఆ నగదును కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ గా పేర్కొంటున్న బాలకృష్ణకు ఇచ్చినట్లు తెలిసింది. బాలకృష్ణ ఆ నగదును డిప్యూటీ తహసిల్దార్ సందీప్ రెడ్డి గదిలోకి తీసుకెళ్లి అతని బ్యాగ్ లో పెడుతున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నరు. ఈ ఘటనతో సంబంధిత కార్యాలయంలో కలకలం నెలకొంది. సక్సెషన్ వంటి కీలకమైన ప్రభుత్వ సేవల కోసం లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని ఏసిబి డిఎస్పీ ఆనంద్ పేర్కొన్నారు.

### విద్యుత్ మీటర్ల మంజూరుకు రూ.1.20 లక్షల లంచం.. ఏసీబీకి చిక్కిన ఏఈ!

విద్యుత్ మీటర్లు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన టీజీఎస్‌పీడీసీఎల్ మదన్నపేట సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పి.ఎస్.రాకేష్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడి నుంచి రూ.1,20,000 లంచం తీసుకుంటుండగా సంతోష్‌నగర్‌లోని కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. విద్యుత్ మీటర్ల మంజూరు పేరుతో లంచం డిమాండ్ చేసినట్లు ఏఈ పై ఆరోపణలు.ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు ఏఈ పై చర్యలు చేపట్టారు.ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రభుత్వ ఉద్యోగి సామాన్యులకు నరకం చూపిస్తూ,అందిన కాడికి దోచుకుంటున్నారు.అనిశ అధికారులకు చిక్కినప్పటికి ఏ మాత్రం భయము లేకుండా అదేదో గుర్తింపు కార్డుగ దర్జాగా ఫోటోలకు ఫోజులు ఇస్తున్న మేధావులు.

## సర్వభూపాల వాహనంపై వేణుగోపాలుడు

- రుక్మిణీ సత్యభామ సమేతంగా మలయప్పస్వామి దర్శనం..
- గోవింద నామస్మరణతో మార్మోగిన మాడ వీధులు



తిరుమల(ప్రశ్న న్యూస్) తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు గురువారం రాత్రి సర్వభూపాల వాహనసేవ వైభవంగా జరిగింది. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి అలంకారంలో శ్రీ మలయప్పస్వామివారు సర్వభూపాల వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారి దర్శనంతో మాడ వీధులు భక్తిభావంతో పరవశించాయి.

### గజరాజుల ముందు నడక.. మంగళవాయిద్యాల సందడి

సర్వభూపాల వాహనసేవలో గజరాజులు ముందుకు నడుస్తుండగా, మంగళవాయిద్యాలు, భక్తబృందాల చెక్కభజనలు, జీయ్యంగార్ల గోష్ఠి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణ చేశారు. భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ స్వామివారి వాహనసేవ అంగరంగ వైభవంగా సాగింది.

### లోకక్షేమమే సర్వభూపాల వాహన సందేశం

సర్వభూపాల అంటే సమస్త రాజులు అని అర్థం. అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, పరమేశ్వరుడు లోకాలను పరిరక్షించే శక్తులకు ప్రతీకలుగా నిలుస్తారు. వీరంతా స్వామివారిని తమ భుజస్కంధాలపై మోస్తూ సేవించడం ఈ వాహనసేవలోని ప్రత్యేకత.ప్రజలను ధర్మబద్ధంగా పరిపాలిస్తూ, భగవంతుని ఆశీస్సులతో లోకక్షేమానికి కృషి చేయాలనే సందేశాన్ని సర్వభూపాల వాహనసేవ చాటిచెబుతుంది. పాలకులు ధర్మమార్గంలో నడుస్తూ ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలనే ఆధ్యాత్మిక భావన ఇందులో అంతర్లీనంగా ఉంది.

### నేడు మోహినీ అవతారం.. రాత్రి గరుడసేవ

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించే గరుడ వాహనసేవకు ఏర్పాట్లు చేశారు.

ప్రముఖుల హాజరుసర్వభూపాల వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు జానకిదేవి, నన్నపనేని సదాశివరావు, నరేష్ కుమార్, పూర్ణ సాంబశివరావు, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యెమెన్ అధ్యక్ష భవనంపై హౌతీల క్షిపణి దాడి

**- తృటిలో తప్పించుకున్న ప్రధాని**



యెమెన్ (ప్రశ్న న్యూస్) యెమెన్‌లో మరోమారు ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడెన్ నగరంలోని అధ్యక్ష భవనంపై హౌతీ రెబల్స్ క్షిపణి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.దక్షిణ యెమెన్‌లోని అల్-మాషిక్ ప్యాలెస్‌ను లక్ష్యంగా చేసుకుని హౌతీలు ఐదు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడి జరిగిన సమయంలో ప్యాలెస్‌లో ప్రధాని, ఇతర మంత్రులు ఉన్నప్పటికీ వారంతా సురక్షితంగా బయటపడ్డారని యెమెన్ సమాచార శాఖ మంత్రి మమ్మర్ అల్-ఎర్యానీ వెల్లడించారు. అయితే, ఈ దాడిలో పలువురు గాయపడినట్లు ఆయన వివరించారు.మరోవైపు, ఈ దాడిపై హౌతీ అనుకూల మీడియా సంస్థలు స్పందించాయి. తాము సౌదీ అరేబియా నేతృత్వంలోని సైనిక కార్యకలాపాల ప్రధాన కార్యాలయంతో పాటు ఆయుధ డిపోలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు నిర్వహించినట్లు ప్రకటించాయి. యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వైమానిక దాడులు నిర్వహిస్తున్న విషయం విదితమే. వీటికి ప్రతీకారంగా, ఇరాన్ మద్దతు గల హౌతీ రెబల్స్ తమ ఆధీనంలోని ప్రాంతాల నుంచి సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలు, సైనిక స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల సౌదీ రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీలు జరిపిన క్షిపణి దాడిలో 13 మంది మరణించారు. గత దశాబ్ద కాలంలో సౌదీ అరేబియాలో జరిగిన అత్యంత భీకర దాడిగా దీనిని పరిగణిస్తున్నారు.

# సంసార సాగరంలో ఉప్పెన.. కానరాని రక్త సంబంధాలు

- జాడ లేని ఉమ్మడి కుటుంబాల-ప్రస్తుత సమాజం పై తీవ్ర ప్రభావం.
- చిన్న పెద్ద, మంచి చెడు,చిరాస్థుల్లో చికాకు పెడితే చితకబాదడానికి వెనుకడాని రక్త సంబంధాలు
- ఊరేకాదు,పట్టణాల్లో సైతం ఆస్తులుంటేనే గౌరవం,కళ్ల ముందు ఉన్న పలకరింపులకు నోచుకోని బంధుత్వాలు
- "50"ఏళ్ల క్రితం ఎదురు పడితే ఆప్యాయతతో పలకరిస్తూ మంచి చెడు పై
- మాటలు.కాలం మారింది కన్న వాళ్ళైనా కళ్ల ముందు ఉంటే ఆవేశంతో కాటికి దారి చూపే వారసులు ఉన్నారు.
- "10"రూ/లకే మర్డర్ చేసే రోజులు వచ్చేశాయి.ఇక కోట్ల రూపాయలు ఉంటే చాలా గౌరవంగా ప్లాన్ చేసి పరలోకానికి రెడ్ కార్పెట్ వేస్తారు.



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మన సంస్కృతి, సంప్రదాయాలకు ఉమ్మడి కుటుంబం ఓ వ్యవస్థ ఒక బలమైన పునాది.ఒకే గొడుగు కింద,పెద్దల ఆశీస్సుల నడుమ, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, వారి పిల్లలు కలిసిమెలసి జీవించడం మన వంశపారంపర్యం. "కలిసి ఉంటే కలదు సుఖం"అనే నానుడికి తగ్గట్టుగా ఆ రోజుల్లో ప్రతి ఇంట్లోనూ పండుగ వాతావరణం ఉండేది. కష్టసుఖాలను పంచుకుంటూ,ఆస్తుల పంపకాలు సమంగా జరుగుతూ,ఉమ్మడి ఆస్తిగా బాధ్యతలు స్వీకరించే సంప్రదాయం ఉండేది.

### ఉమ్మడి కుటుంబాల స్వర్ణయుగం-ఈ జీవన విధానం

కాని కాలక్రమేణా మారుతున్న ఆధునిక జీవన శైలి,ఉపాధి అవకాశాలు,వ్యక్తిగత భావాల కారణంగా ఈ ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై,కేంద్ర కుటుంబాలుగా మారుతున్న సందర్భాలు కోకొల్లలు.గతంలో ఫ్యామీలిలో ఏ చిన్న సమస్య వచ్చినా అందరూ కలిసి చర్చించి పరిష్కరించేవారు,అలాగే పిల్లల పెంపకంలో పెద్దల అనుభవం ఎంతో ఉపయోగపడేది.భూములు,ఆస్తులు ఉమ్మడి కుటుంబం పేరున ఉండి,అందరికీ సమానంగా ఆ ఫలాలు అందేవి. దీనివల్ల ఆర్థిక ఇబ్బందులు తక్కువగా ఉండి పిల్లలకు పెద్దల పట్ల గౌరవం, తోటివారితో సర్దుకుపోయే తత్వం, బంధుత్వాల విలువ చిన్నతనం నుంచే అలవడేవి. ఇంట్లో ఎప్పుడూ నవ్వులు, సందడి ఉండటం వల్ల ఎవరికీ మానసిక ఒత్తిడి లేదా ఒంటరితనం ఉండేది కాదు.అలాగే ఆస్తి తగాదాలు ఉండేవి కావు.

### ఒంటరితనం మనిషి, ఓటమి వైపు చూపు

కన్నతల్లి లాంటి ఊరును వదిలి,ఆర్థిక సమస్యలకు దగ్గరై కుటుంబాన్ని పట్టి పీడిస్తున్న ఒంటరితనం.ఈ నేపథ్యంలో బ్రతుకుదెరువు కోసం నగరాలకు వలస వెళ్లడం,ఉద్యోగాలరీత్యా వేర్వేరు ప్రాంతాలకు మారాల్సి రావడం,ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక స్వతంత్ర జీవనశైలిని,వ్యక్తిగత గోప్యతను కోరుకోవడం, ఆస్తుల పంపకాలలో పారదర్శకత లోపించడం, చట్టపరమైన వివాదాలు పెరిగాయి. దీనివల్ల ఉమ్మడి కుటుంబాలలో అందరి మధ్య దూరం పెరిగింది.రక్తసంబంధీకుల మధ్య కూడా కేవలం పండగలకు మాత్రమే ఫోన్లలో పలకరించుకునే స్థాయికి దూరం పెరిగింది. వరసులు లేని "రోబో "సంబంధాలు. కాని గతంలో పిన్ని,బాబాయ్,మేనమామ వంటి బంధాల పేర్లు కూడా ప్రస్తుతం సమాజంలో దూరమవుతున్నాయి. ఉద్యోగాల బిజీలో తల్లిదండ్రులు ఇద్దరూ బయటకు వెళ్తుండటంతో,పిల్లలకు తాత,అమ్మామ్మ తోడు లేక కథలు,సంస్కృతి నేర్పేవారు కరువయ్యి పిల్లలు ఒంటరితనానికి, ఫోన్లు, సోషల్ మీడియా,పబ్జి గేమ్ లకు బానిసవుతున్నారు. బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారు.అలాగే సమస్యలు వచ్చినప్పుడు పంచుకోవడానికి ఎవరూ లేకపోవడం వల్ల యువత లో ఒత్తిడి,ఆందోళన ఎక్కువవుతున్నాయి.

### వృద్ధాశ్రమాల పెరుగుదల-సమాజానికి హెచ్చరిక

ఆదరించాల్సిన వృద్ధాప్యంలో పెద్దలను చూసేవారూ లేక, వృద్ధాశ్రమాలకు పంపే దుస్థితి సమాజంలో కల్చర్ గా భావిస్తున్నారు. తల్లిదండ్రులను కేవలం భారంలా చూడకుండా,వారి అనుభవాన్ని గౌరవిస్తూ వారిని మనతో పాటు ఉంచుకునే ప్రయత్నం చేస్తే ఎన్నో లాభాలు.



### కుటుంబ అనుబంధాల పునరుజ్జీవన,కర్తవ్యం:

ఉద్యోగాల రీత్యా వేరుగా ఉంటున్నా,రోజూ కనీసం ఒక్కసారైనా వీడియో కాల్స్ ద్వారా కుటుంబ సభ్యులందరూ మాట్లాడుకునే అలవాటు చేసుకోవాలి, నెలకోసారైనా లేదా పండగలకు అందరూ ఒకే చోట చేరి కలుసుకునేలా కుటుంబ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకోవాలి.ఆస్తుల విషయంలో పారదర్శకత పాటిస్తూ,చిన్న చిన్న మనస్పర్థలను మనసులో ఉంచుకోకుండా సర్దుకుపోయే గుణం అలవర్చుకోవాలి.అప్పుడే సమస్యలు తలెత్తకుండా సంసార సాగరంలో ఉప్పెనకు తావుండదు. కాలం మారినా,జీవన శైలి మారినా రక్త సంబంధాలు, సంస్కృతిని మనం మరువకూడదు.ఇళ్లు వేరైనా మనసులు ఒక్కటే అనే భావనను పెంపొందించుకుంటేనే రేపటి తరానికి మనం మంచి సమాజాన్ని అందించగలము."కలిసి ఉందాం - బంధాలను కాపాడుకుందాం."అనే ఆలోచన భావి తరాలకు అందించటానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి అప్పుడే అనుకూలమైన వాతావరణం,భవిష్యత్తులో మన వారసులకు ఇచ్చే విలువైన ఆస్తులు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588